

▶ సింహాచలంలో వినియోగిస్తున్నది కల్తీ నెయ్యే
- ప్రాథమికంగా నిర్ధారించిన ఫుడ్ సేఫ్టీ అధికారులు
- 945 కిలోలు సీజ్ చేసిన అధికారులు
- పరీక్షల కోసం నమూనాల సేకరణ

- వివరాలు మెయిన్‌లో ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



స్వీట్స్‌లోనూ కల్తీ నెయ్యే?

స్వచ్ఛమైన నేతితో తయారుచేసినవంటూ మోసం చేస్తున్న కొంతమంది దుకాణదారులు

డాల్డా, పామాయిల్, తదితరాలు మిక్సింగ్

- కలర్ కోసం రంగులు...
- పట్టని ఫుడ్ సేఫ్టీ అధికారులు
- కాస్త నాణ్యమైన నెయ్యి కొనాలంటే కిలోకు రూ.800 నుంచి రూ.1,600 పెట్టాల్సిందే



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'నేతి బీరకాయ' చందంలాగే నేతి మిఠాయిలు తయారవుతున్నాయి. 'స్వచ్ఛమైన నేతితో తయారైన స్వీట్లు' అంటూ భారీ బోర్డులు పెట్టి పెద్దఎత్తున విక్రయాలు చేస్తున్న సంస్థలు అడ్డగోలుగా మోసాలకు పాల్పడుతున్నాయి. నగరంలో వీధికి రెండు స్వీటు దుకాణాలు వెలిశాయి. 'వేడి వేడి నేతి బొబ్బట్లు' అంటూ అక్కడే పెనం పెట్టి, దానిపై బొబ్బట్లు అటు ఇటు తిప్పుతూ...గరిటెతో నెయ్యి పోసి వేడి వేడివి ప్యాకింగ్ చేసి ఇస్తున్నాయి. కిలోకు కేవలం రూ.230 నుంచి రూ.260 తీసుకుంటున్నాయి. కొనుగోలుదారులకు కనీసం అది నిజంగా నెయ్యేనా?, అనే అనుమానమే రావడం లేదు. అలాగే నెయ్యితో తయారుచేసిన లడ్డూలంటూ అదనంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. కనీసం ముక్కుకు నెయ్యి వాసన కూడా రాదు.

కిలో నెయ్యి రూ.600కి తక్కువ లేదు

నగరంలో కిలో నెయ్యి ఎవరూ రూ.600 కంటే తక్కువకు ఇవ్వడం లేదు. విశాఖ డెయిరీ కిలో రూ.660 చొప్పున అమ్ముతోంది. అదే ఆవులను పెంచుతూ పాల వ్యాపారం చేసేవారైతే కిలో రూ.800పైనే అమ్ముతున్నారు. ఆర్గానిక్ వ్యవసాయం చేసేవారైతే దేశీ ఆవు నెయ్యి రూ.1,600, గిరి ఆవుల నెయ్యి కిలో రూ.2,500 చొప్పున విక్రయిస్తున్నారు. స్వచ్ఛమైన నెయ్యి కిలో తయారు చేయాలంటే కనీసం 15 లీటర్ల పాలు అవసరం. రైతుల నుంచి కొనే పాలు లీటరు రూ.40 వేసుకున్నా (విశాఖ డెయిరీవి రూ.60పైనే) పాలకే రూ.600 వ్యయం అవుతుంది. వాటిని వేడి చేయడానికి, గంటల తరబడి ప్రాసెస్ చేయడానికి ఇంకో రూ.150 ఖర్చు అవుతుంది. అంటే సాధారణ పాలతో కిలో నెయ్యి తయారీకి రూ.750 వ్యయం అవుతుంది. రూ.50 లాభం వేసుకొని కిలో రూ.800కి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఈ నెయ్యిని చెంచాతో తీసి ముక్కు దగ్గర పెట్టుకుంటే చక్కటి సువాసన వస్తుంది. అయితే రోజూ డబ్బాల కొద్దీ (డబ్బాకి 15 కిలోలు) నెయ్యి వాడే స్వీటు షాపుల వారు కాంట్రాక్టర్ల నుంచి కిలో రూ.400 కంటే తక్కువకే కొంటున్నారు. అంత తక్కువ రేటుకు నాణ్యమైన నెయ్యి రానే రాదు. ఆ విషయం దుకాణాల యజమానులకూ తెలుసు. అయినా కొంటున్నారు. సరఫరాదారులు కొందరు నెయ్యిలో డాల్డా కలుపుతుంటే, మరికొందరు ఆవు, పంది కొవ్వులు కలిపి నెయ్యి సరఫరా చేస్తున్నారు. స్వీటు షాపుల వారికి వ్యాపారమే ప్రధానం కాబట్టి ఇవన్నీ పట్టించుకోవడం లేదు. నగరంలోని కొన్ని స్వీటు షాపులకే ఐఎస్‌ఓ సర్టిఫికేషన్‌లు ఉన్నాయి. మిగిలిన వారికి వాటి గురించి అవగాహనే లేదు.



ప్రాంతీయ లేబొరేటరీకి ఎన్‌ఏబీఎల్ గుర్తింపు లేదు

- జీవీ అప్పారావు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, డివిజన్-3

చినవాల్తేరులోని ప్రభుత్వ ప్రాంతీయ పబ్లిక్ హెల్త్ లేబొరేటరీకి ఎన్‌ఏబీఎల్ గుర్తింపు లేదు. గుర్తింపు ఉన్న లేబొరేటరీలోనే ఆహార పదార్థాలు కల్తీ జరిగిందా? లేదా? అనేది పరీక్షించుకోవాలి. చినవాల్తేరు లేబొరేటరీకి కేవలం నీటిని పరీక్షించే యంత్రాలే ఉన్నాయి. ఆహార పదార్థాలకు వారు ఇచ్చే సర్టిఫికెట్లు చెల్లవు. సింహాచలం దేవస్థానం అక్కడి నుంచి ఎటువంటి సర్టిఫికెట్లు తీసుకున్నా అవి పరిగణనలోకి రావు.

గడువు తేదీ గాలికి...

ప్యాకింగ్ చేసే ప్రతి ఆహార ... మిగతా 6వ పేజీలో

చెత్త పన్ను రద్దు

నగర వాసులపై నెలకు తొలగిన భారం రూ.7.77 కోట్లు

- వైసీపీ హయాంలో ఇంటికి రూ.120 చొప్పున వసూలు
- ప్రజల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత
- తాము అధికారంలోకి వస్తే యూజర్ చార్జీలు రద్దు చేస్తామన్న టీడీపీ అధినేత
- ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న చంద్రబాబునాయుడు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో విధించిన చెత్త పన్ను నుంచి నగరవాసులకు ఉపశమనం లభించింది. చెత్త సేకరణకు ప్రజల నుంచి వసూలుచేసిన యూజర్ చార్జీలను రద్దు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. దీంతో నగరవాసులపై ప్రతి నెలా రూ.7.77 కోట్లు భారం తగ్గినట్టయింది. సీఎం ప్రకటనపై నగరవాసుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

నగర పరిధిలో నివాసాలతోపాటు వాణిజ్య సముదాయాలు, దుకాణాల నుంచి చెత్తసేకరణకు గత వైసీపీ ప్రభుత్వం యూజర్ చార్జీల వసూలుకు శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఘనవ్యర్థాల నిర్వహణ చట్టం-2016 ప్రకారం చెత్త సేకరణ, తరలింపు శాస్త్రీయ నిర్వహణ కోసం యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నట్టు ప్రకటించింది. రెసిడెన్షియల్ కేటగిరీలో 5,87,910 అసెస్‌మెంట్లు, కమర్షియల్ కేటగిరీలో ఉన్న 25,722 అసెస్‌మెంట్ల నుంచి జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో యూజర్ చార్జీలు వసూలు చేయాలని ఆదేశించింది. అందుకు వీలుగా మూడేళ్ల కిందట కౌన్సిల్‌లో తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు టీడీపీ సహా విపక్ష కార్పొరేటర్లంతా తీవ్రంగా వ్యతిరేకించారు. అయినప్పటికీ వైసీపీకి సంఖ్యాబలం ఉండడంతో నివాస భవనాలను నెలకు రూ.120 చొప్పున, మురికివాడల్లో అయితే రూ.60 చొప్పున, కమర్షియల్ కేటగిరీ అయితే రూ.200 నుంచి రూ.15 వేల వరకూ యూజర్ చార్జీలు వసూలు చేసేందుకు తీర్మానాన్ని ఏకపక్షంగా ఆమోదించింది. అదే ఏడాది నవంబరు నుంచి యూజర్ చార్జీలు వసూలుకు శ్రీకారం చుట్టారు. వార్డు వలంటీర్లతోపాటు సచివాలయంలోని శానిటరీ సెక్రటరీలకు ఆ బాధ్యత అప్పగించారు. ప్రతి నెలా నివాసాల కేటగిరీలో ఉన్న 5,87,910 అసెస్‌మెంట్ల నుంచి రూ.7.05 కోట్లు, వాణిజ్య పరమైన కేటగిరీలోని 25,722 అసెస్‌మెంట్ల నుంచి రూ.69.83 లక్షలు చొప్పున మొత్తంగా రూ.7.77 కోట్లు ఆదాయం సమకూరుతుందని లెక్క గట్టారు. కానీ యూజర్ చార్జీల వసూలుపై నగరవాసుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో కొన్నాళ్లు వసూళ్లకు వెనుకాడిన జీవీఎంసీ అధికారులు...తిరిగి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో వార్డు సచివాలయ కార్యదర్శులపై ఒత్తిడి పెంచారు. నెలవారీ టార్గెట్లు విధించి, చార్జిమెమోలు జారీచేస్తూ హడలెత్తించారు. ఈ నేపథ్యంలో సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి యూజర్ చార్జీలు వసూలు చేయలేక తరచూ ఆందోళనలకు దిగేవారు.



జీవీఎంసీతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కార్పొరేషన్లలో చెత్త పన్ను విధింపుపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే యూజర్ చార్జీలను రద్దు చేస్తామని నాడు విపక్ష నేతగా ఉన్న తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి రావడంతోనే యూజర్ చార్జీలు వసూలును జీవీఎంసీ అధికారులు నిలిపివేశారు. అయితే అధికారిక ప్రకటన రాకపోవడంతో సందిగ్ధం నెలకొంది. ఈ క్రమంలో చెత్తసేకరణకు యూజర్ చార్జీలు వసూలును పూర్తిగా రద్దు చేస్తున్నట్టు సీఎం చంద్రబాబునాయుడు శుక్రవారం ప్రకటించారు.

కొలిక్కివచ్చిన రెవెన్యూ బదిలీలు?

- నేడు జాబితా విడుదల చేసే అవకాశం
- మిగిలిన శాఖల్లోనూ...

విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో బదిలీలకు ఆదివారంతో గడువు ముగియనున్నది. గడువు మరోసారి పొడిగిస్తారన్న ప్రచారం జరుగుతోంది. అయితే ఉమ్మడి జిల్లాలో రెవెన్యూ శాఖాపరంగా బదిలీలకు కసరత్తు ముగిసినట్టు చెబుతున్నారు. బహుశా ఆదివారం బదిలీ ఉత్తర్వులు వెలువడవచ్చునంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఆదివారం బదిలీ ఉత్తర్వులు రావాలని, లేకపోతే అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో తహసీల్దార్ల పరిస్థితి మరింత ఇబ్బందిగా మారే అవకాశం ఉందంటున్నారు. అనకాపల్లి జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్‌లో తహసీల్దార్లకు పోస్టింగ్స్‌పై జూలై నుంచి అనిశ్చితి కొనసాగుతోంది. ఎన్నికల నేపథ్యంలో ఉత్తరాంధ్రలో మిగిలిన రెండు ఉమ్మడి జిల్లాలకు వెళ్లి జూలైలో వెనక్కి వచ్చిన తహసీల్దార్లకు గతంలో పనిచేసిన మండలం కాకుండా మరోచోట పోస్టింగ్ ఇవ్వాలి. కానీ ఇంత వరకూ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో బదిలీలు పూర్తిచేయాలని నిర్ణయించుకున్న మూడు జిల్లాల కలెక్టర్లు ఇప్పటికే సమావేశమై చర్చించుకున్నారు. ఎవరిని ఏజెన్సీకి పంపాలి?, ఎవరిని కొండ పైనుంచి మైదానానికి తీసుకురావాలనే జాబితా రూపొందించుకున్నారని తెలిసింది. శనివారం బదిలీ చేస్తే రాజకీయ నాయకుల నుంచి ఒత్తిడి తెచ్చే అవకాశం ఉన్నందున ఆదివారం సాయంత్రంలోగా జాబితా వెలువరిస్తే సరిపోతుందని అంచనాకు వచ్చారంటున్నారు. కాగా జిల్లా పరిషత్, జల వనరులు, పౌర సరఫరాలు, పంచాయతీరాజ్, ఇతర శాఖల్లో బదిలీలకు సంబంధించి కూడా కసరత్తు పూర్తయ్యింది. ఆయా శాఖల అధికారులు జాబితాలకు కలెక్టర్ ఆమోదం తీసుకునే పనిలో ఉన్నారు. వాటిని కూడా ఆదివారం విడుదల చేసే అవకాశం ఉంది.

పెద్ద దిక్కులేని జల వనరుల శాఖ

- గత నెలాఖరున ఎస్‌ఈ పదవీ విరమణ
- మూడు వారాలుగా ఖాళీగానే పోస్టు
- డిప్యూటీ సూపరింటెండెంట్, ఇంజనీర్ పోస్టు కూడా ఖాళీయే...

విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జల వనరుల శాఖ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పనిచేసిన సూర్యకుమార్ గత నెల 31న పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో కొత్త అధికారిని నియమించాలి లేదా మరో అధికారికి బాధ్యతలు అప్పగించాలి. కానీ 19 రోజులవుతున్నా ఎస్‌ఈ పోస్టును ఖాళీగా ఉంచారు. అప్పటి నుంచి కార్యాలయంలో విధానపరమైన నిర్ణయాలు తీసుకునే అధికారి ఎవరూ లేరు. విచిత్రమేమిటంటే సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ పోస్టు కూడా చాలాకాలంగా ఖాళీగానే ఉంది. అనకాపల్లి జిల్లా చోడవరం వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ డివిజన్ ఈఈ త్రినాథం డిప్యూటీ ... మిగతా 6వ పేజీలో

బెంగళూరు-గౌహతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ముప్పు

- ఎస్-7 బోగీ చక్రాల నుంచి వ్యాపించిన మంటలు
- ప్రయాణికులు అప్రమత్తమై చైన్ లాగడంతో సింహాచలం రైల్వే స్టేషన్‌లో నిలిచిన రైలు;
- బ్రేక్ షూలు చక్రాలకు పట్టేయడంతో మంటలు వచ్చినట్టు నిర్ధారణ
- తక్షణమే స్పందించి మంటలను అదుపుచేసిన భద్రతా సిబ్బంది

- వివరాలు మెయిన్‌లో



సింహాచలం రైల్వే స్టేషన్‌లో నిలిచిన బెంగళూరు-గౌహతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్

జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్‌గా ప్రభాకరరావు



విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ చీఫ్ సిటీప్లానర్‌గా ఎ.ప్రభాకరరావును నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ఇక్కడ సీసీపీగా ఉన్న బి.సురేష్‌కుమార్‌ను కొద్దిరోజులు కిందట టౌన్‌అండ్‌కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. అప్పటి నుంచి సీసీపీ పోస్టు ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో ఏపీ సీఆర్‌డీఏలో అదనపు డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎ.ప్రభాకరరావును జీవీఎంసీ సీసీపీ పోస్టులో నియమించింది. ప్రభాకరరావుకు గతంలో సీపీపీగా, వీఎంఆర్‌డీఏ సీయూపీగా పనిచేసిన అనుభవం ఉంది. నిజాయితీపరుడిగా, ప్రజా ప్రతినిధుల సిఫార్సులను కూడా పరిణనలోకి తీసుకోకుండా ముక్కుసూటిగా వ్యవహరిస్తారని ప్రభాకరరావుకి గుర్తింపు ఉంది.

ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్

తొలి రోజు అంతంతమాత్రంగా స్పందన

- రెండో రోజు 600 నుంచి 800 టన్నుల బుకింగ్
- శ్రీకాకుళం నుంచి తెప్పించుకునేందుకు అత్యధికుల మొగ్గు
- 20 టన్నుల ఇసుకకు పన్ను రూ.6,000
- రవాణా చార్జీ రూ.13,000-రూ.14,000
- టన్ను రూ.1,000కు లభిస్తుందంటున్న గనుల శాఖ అధికారి

విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):

ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ మొదలైంది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో రీచ్‌లు లేకపోవడంతో నిర్మాణదారులకు శ్రీకాకుళం, రాజమండ్రి ప్రాంతాల నుంచి ఇసుక రవాణా చేయనున్నారు. నగరానికి రాజమండ్రి దూరం కావడంతో ఎక్కువ మంది శ్రీకాకుళం నుంచి ఇసుక తెప్పించుకునేందుకు మొగ్గు చూపుతున్నారు.



ఆన్‌లైన్ బుకింగ్ గురువారమే ప్రారంభమైనా తొలిరోజు పెద్దగా స్పందన కనిపించలేదు. కానీ శుక్రవారం ఒక్కరోజే ఆరు నుంచి ఎనిమిది వందల టన్నుల ఇసుక బుకింగ్ జరిగినట్టు సంబంధిత అధికారులు వెల్లడించారు. రీచ్‌ల వద్ద ఇసుక ఉచితమే అయినప్పటికీ పలు రకాల పన్నుల రూపంలో టన్నుకు రూ.300 వరకూ చెల్లించాల్సి ఉంటుంది. ఇక రీచ్‌ల నుంచి నగరానికి రవాణా నిమిత్తం జిల్లా యంత్రాంగం ధర నిర్ణయించింది. 80 కిలోమీటర్ల దూరం వరకు కిలోమీటరుకు రూ.6.90, అంతకు మించి దూరానికి అదనంగా రూ.3.50 ఖరారు చేసింది. దీని ప్రకారం వంశధార నదిలో రీచ్‌ల నుంచి నగరానికి ఇసుక తీసుకురావడానికి సగటున లారీ కిరాయి రూ.13 వేల నుంచి రూ.14 వేల వరకు (ఎన్‌ఏడీ, గాజువాక, మల్కాపురం, పెందుర్తి ప్రాంతాలు) వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు 20 టన్నుల ఇసుకకు ప్రభుత్వానికి పన్నుల రూపేణా రూ.6 వేలు, రవాణా చార్జీలు రూ.13 వేల నుంచి రూ.14 వేలు కలిపితే రూ.19 వేల నుంచి రూ.20 వేలు అవుతుంది. అంటే టన్ను రమారమి రూ.1000కు లభిస్తుందని గనుల శాఖ అధికారి ఒకరు వివరించారు. గత ప్రభుత్వం టన్ను ఇసుక రూ.1,200 నుంచి రూ.1,300కు విక్రయించింది.

మూడు నెలల క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రెండు డిపోల్లో ఉన్న ఇసుకను మొదట్లో రూ.1,376 (అగనంపూడి), రూ.958 (భీమిలి)కు విక్రయించారు. భీమిలిలో నిల్వలు అయిపోయిన తరువాత అగనంపూడిలో రూ.1,076కు అమ్మారు. అయినా డిపో నుంచి నిర్మాణం జరిగే చోటకు చేరవేతకు రవాణా చార్జీలు అదనం కావడంతో టన్నుకు రూ.1,500 నుంచి రూ.1,800 చెల్లించాల్సి వచ్చింది. దీంతో వినియోగదారుల నుంచి వ్యతిరేకత ... మిగతా 6వ పేజీలో

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశానికి 75 అంశాలతో అజెండా



విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24న జరిగే జీవీఎంసీ కౌన్సిల్ సమావేశానికి 75 అంశాలతో రెండు ఎజెండాలను అధికారులు సిద్ధంచేశారు. 48 అంశాలతో ప్రధాన ఎజెండా తయారుచేసి ఇప్పటికే సభ్యులకు పంపిన అధికారులు..తాజాగా మరో 27 అంశాలతో అనుబంధ ఎజెండాను రూపొందించి అందజేశారు. ఎజెండాలో ప్రధానంగా ఉద్యోగుల సర్వీస్‌కు సంబంధించిన అంశాలు ఉన్నాయి. ఐటీ విభాగంలో పనిచేస్తున్న 17 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కొనసాగింపు, ప్రజారోగ్య విభాగంలోని అవుట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.1.14 కోట్లతో కొబ్బరినూనె, సబ్బులు కొనుగోలు, ఈ ఏడాది జనవరిలో పారిశుధ్య కార్మికులు సమ్మె చేసిన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రూ.వెయ్యి చొప్పున సాధారణ నిధుల నుంచి చెల్లింపు, ఆన్‌లైన్ బిల్డింగ్ ప్లాన్ సిస్టమ్ నిర్వహణకు ఇద్దరు టెక్నీషియన్ల కొనసాగింపు, పారిశుధ్య కార్మికులకు ఒక నెల హెల్త్ అలవెన్స్ చెల్లింపు, బాల్యం టీచర్లు, ఆయాల కొనసాగింపు, హార్టికల్చర్ విభాగంలోని 42 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏడాది కాలం కొనసాగింపు, మారియట్ హోటల్ నుంచి ఎన్‌జీజీవోస్ కాలనీ వరకూ రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌పై టైల్స్, కాలువ నిర్మాణం, యూసీడీ విభాగంలోని నైట్‌షెల్టర్లలో పనిచేస్తున్న సిబ్బందికి పారితోషికం పెంపు, యూసీడీ విభాగంలో పనిచేస్తున్న 53 మంది సీఓలు, ఇద్దరు డీఎంసీలు, ముగ్గురు ఏడీఎంసీల సేవలు ఏడాదిపాటు కొనసాగింపు, ప్రజారోగ్య విభాగంలోని వాహనాల రిపేర్లు, రోడ్ క్లీనింగ్ కోసం మినీ స్కిడ్ స్టీర్ లోడర్ వాహనాలను సమకూర్చడం, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఈఈ ప్రసాదబాబు సేవలను తిరిగి ఉపయోగించుకునే ప్రతిపాదన వంటి అంశాలు ఉన్నాయి.

అత్యంత వైభవంగా సంకష్టహర చతుర్థి

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 21 : పోర్టు ఆస్పత్రి ఎదురుగా నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న లక్ష్మీ వినాయక ఆలయంలో సంప్రదాయ రీతిలో శనివారం రాత్రి సంకష్టహర చతుర్థి అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు శివశ్రీ బాలానంద శివాచార్య స్వామి సారథ్యంలో శైవ ఆగమ సంప్రదాయంలో అభిషేకాలు, లక్ష్మీ వినాయక హోమం, అర్చనలు, ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, గురుపాద సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

భూదాన్ భూములు కాపాడాలి

మహారాణిపేట, సెప్టెంబరు 21: భూదాన్ యజ్ఞ భూములను కాపాడాలని ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండల్ అధ్యక్షుడు ఎస్.రాంబాబు నాయుడు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం మండలి సభ్యులు కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందించారు. చిన్నగదిలి మండలం పరదేశీపాలెంలోని భూదాన్ భూమి ఆక్రమణకు దళారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు. కొంతమంది నాయకుల అండతో నకిలీ పత్రాలు సృష్టించి తమ సొంత భూమిగా మార్చుకోవాలని చూస్తున్నారని ఆంధ్రప్రదేశ్ భూదాన్ యజ్ఞ బోర్డు పేరుతో నకిలీ ప్రొసీడింగ్స్ తయారు చేసి వాటిని ఇళ్ల స్థలాలుగా అమ్ముకుంటున్నారని తెలిపారు. కలెక్టర్‌ను కలిసినవారిలో డా.దీనబంధు, సభ్యులు ఉన్నారు.

పేదలకు అండగా ఉండే ప్రభుత్వమిది

▸▸ 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఉద్ఘాటన



మద్రిపాలెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, చిత్రంలో ఎంపీ శ్రీభరత్, ఇతర నాయకులు



రామాటాకీస్ రోడ్డులో కంటి ఆసుపత్రి వద్ద అన్న క్యాంటీన్ ప్రారంభం సందర్భంగా భోజనం వడ్డిస్తున్న నేతలు

మద్రిపాలెం, సెప్టెంబరు 21: ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వ లక్ష్యమని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. శనివారం గ్రేటర్ పరిధి 53వ వార్డు మద్రిపాలెం అర్‌అండ్‌బీ జంక్షన్ వద్ద నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎంపీ అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం అరాచక పాలన సాగించిందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం తప్పకుండా ప్రజాపాలన సాగిస్తుందన్నారు. టీడీపీ నేతలు గండిబాబ్జీ, పొలమరశెట్టి శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గ జనసేన కన్వీనర్ పసుపులేటి ఉషాకిరణ్, వార్డు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సీతమ్మధార: రామాటాకీస్ రోడ్డు ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి వద్ద అన్న క్యాంటీన్‌ను ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, ఎంపీ శ్రీభరత్‌లు శనివారం ప్రారంభించారు. అనంతరం వడ్డించారు. ఇది పేదలకు అండగా ఉండే మంచి ప్రభుత్వమని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేరుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు గండి బాబ్జి, ఉషాకిరణ్, సురేష్‌బాబు, ఎండీ నజీర్, వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాధవధార; ప్రభుత్వం గత 100 రోజుల్లో చేసిన పనులతో ప్రతి చోట ప్రజానీకం 'ఇదే మేం కోరుకున్న మంచి ప్రభుత్వమ'ని సంతోషంగా చెబుతున్నారని 51వ వార్డు టీడీపీ అధ్యక్షులు సనపల కీర్తి పేర్కొన్నారు. శనివారం మాధవధార తెన్నేటినగర్‌లో ఇంటింటికీ వెళ్లిన సచివాలయం అధికారులు, వార్డు సీనియరు నాయకులు ప్రభుత్వం వంద రోజుల్లో చేసి చూపించిన సంక్షేమ కార్యక్రమాల్ని వివరించారు. కీర్తి ప్రజల అభిప్రాయాల్ని తెలుసుకున్నారు. 50వ వార్డులో ఆ వార్డు ప్రెసిడెంట్ సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో సీనియరు నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని జగన్ నాకేశాడు: విష్ణుకుమార్ రాజు

సింహాచలం: అవినీతి ఎక్కడుంటే జగన్మోహన్‌రెడ్డి, అతడి అనుచరులు అక్కడ ఉంటూ రాష్ట్రాన్ని సర్వం నాకేశారని విశాఖ ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు విష్ణుకుమార్‌రాజు విమర్శించారు. అవినీతికి చిరునామాగా ఉండే జగన్ మాటలు పట్టించుకోవాల్సిన పనిలేదన్నారు. శనివారం సాయంత్రం ఆయన సింహగిరికి చేరుకుని తొలుత వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం అప్పన్న ప్రధాన స్టోర్సును సందర్శించి ప్రసాదాల వినియోగంలో వాడుతున్న ముడిసరుకులు, వాటి కొనుగోళ్లు తదితర అంశాలపై అధికారుల నుంచి వివరాలు సేకరించారు. అన్నవరం దేవాలయానికి కిలో నెయ్యి రూ.520లకు సరఫరా అవుతుంటే సింహాచలం దేవాలయానికి మాత్రం రూ.344లకు జీఎస్టీ మినహా సరఫరా చేస్తుండటంపై సమగ్ర విచారణ జరగాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో దేవాలయాల్లో లడ్డూ ప్రసాదాల తయారీలో కల్తీ అంశం కేంద్రం దృష్టికి వెళ్లిందని, ప్రధాని నరేంద్ర మోదీ, జేపీ నడ్డా ఆదేశాల మేరకు తాను సింహగిరికి వచ్చినట్టు తెలిపారు.

తెలుగు సాహితీ జాడ .. మన గురజాడ

▸▸ జయంతి సభలో వక్తల అక్షర నివాళి



గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

సీతంపేట, సెప్టెంబరు 21: ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగం, సమైక్య భారతి సంయుక్తంగా యుగకర్త మహాకవి గురజాడ వెంకట అప్పారావు 162వ జయంతి వేడుకలను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అసెంబ్లీ హాల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత డాక్టర్ గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు సాహిత్యంలో ఆయనది సుస్థిర స్థానమని పేర్కొన్నారు. ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ గురజాడ స్త్రీ చైతన్యం కోసం చాలా కృషి చేశారని తెలిపారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ ఆధునిక సాహిత్య గురువు, తెలుగు సాహిత్యాన్ని, భాషను చైతన్యం చేసిన మహనుభావుడని శ్లాఘించారు. విప్లవ పంథాలో సమాజాన్ని ముందుకు తీసుకెళ్లిన మహాకవి గురజాడ అన్నారు. ఈ సమావేశంలో ఎల్.మృదుల, డాక్టర్ ఎం.విజయగోపాల్, పి.కన్నయ్య, ఆచార్య సాల్మన్ బెన్ని, ఆచార్య నల్లా సత్యనారాయణ, ఆచార్య గోవాడ వీర్రాజు, ఆచార్య ధనరాజు, ఉప్పల అప్పలరాజు, డాక్టర్ లావణ్య, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ రత్నశేఖర్, డాక్టర్ గిరీష్‌కుమార్, పరిశోధకులు, స్నాతకోత్తర విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహితంగా సాగరతీరం

▸▸ కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపు



తీరంలో చెత్త ఏరుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట, సెప్టెంబరు 21: ఒక్కసారికి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం అంతర్జాతీయ తీర పరిశుభ్రతా దినోత్సవం సందర్భంగా బీచ్‌రోడ్డులో స్వచ్ఛతాహీ సేవా-2024 కార్యక్రమం చేపట్టారు. ఇండియన్ కోస్టుగార్డు ఎకోలాస్టిక్ సంస్థ ఆధ్వర్యంలో సాగరతీరాన్ని శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో కలెక్టర్ స్వయంగా పాల్గొని చెత్త ఏరివేశారు. ఆర్‌కే బీచ్, రుషికొండ పరిసర ప్రాంతాల్లో వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తీర ప్రాంతంలో కాలుష్యం ఎక్కువ కావటంతో జలరాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, తీరంలో చెత్త వేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను వేయటం ద్వారా తీర కాలుష్యం పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తీరంలో ఏర్పాటు చేసిన సైకత శిల్పం ఆకట్టుకుంది. కోస్టుగార్డు ఉన్నతాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ముగిసిన వినాయక ఉత్సవాలు



దుర్గాగణపతి ఆలయంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక తదితరులు

సీతంపేట, సెప్టెంబరు 21: సీతంపేటలోని దుర్గాగణపతి ఆలయంలో శనివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కుమార్తె శ్యామలదీపిక, వార్డు కార్పొరేటర్, ఉత్సవ కమిటీ ఛైర్మన్ సారిపిల్లి గోవింద్‌లు భక్తులకు ప్రసాద వడ్డన చేశారు. ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో శ్యామలదీపిక పాల్గొన్నారు. ఈఓ రమాబాయి, ఉత్సవ కమిటీ ఛైర్మన్ గోవింద్ పర్యవేక్షణలో సుమారు ఆరు వేల మందికి అన్నదానం చేశారు.

జ్ఞానాపురం: కాన్వెంట్ కూడలిలోని సౌభాగ్య గణపతి ఆలయం వద్ద వైష్ణవి టోకు కాయగూరల మార్కెట్ వర్తకసంఘం ఆధ్వర్యంలో 15 రోజులు జరిగిన వినాయక ఉత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ముగిశాయి. దక్షిణ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి ఎస్.సుధాకర్, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావులు సౌభాగ్య గణపతిని దర్శించుకున్నారు. కూడలిలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 5 వేల మంది భక్తులు ప్రసాద వితరణలో పాల్గొన్నారు. 18 అడుగుల వినాయక విగ్రహాన్ని కాన్వెంట్ కూడలి నుంచి కంచరపాలెం, తాటిచెట్లపాలెం మీదుగా ఆర్‌కే బీచ్ వరకు మేళతాళాలు, నృత్యాలతో ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. పలు రకాల రథాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

అంతర కళాశాలల పోటీలు

జ్ఞానాపురం, సెప్టెంబరు 21: సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శనివారం అంతర కళాశాలల పోటీలను ఆంగ్ల విభాగం అధ్యక్షురాలు డా.సుధ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ ప్రారంభించారు. విద్యార్థినులతో పాటు వి.ఎస్.కృష్ణ, గాయత్రి, ఏవీఎన్.సెయింట్ ఏన్స్ తదితర 8 డిగ్రీ కళాశాలల విద్యార్థినులు పోటీపడ్డారు. పలు రకాల పోటీలు నిర్వహించామని షైజీ తెలిపారు. విజేతలైన విద్యార్థినులకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ద్వితీయభాషా విభాగాధిపతి డా.వీకే జయలక్ష్మి జ్ఞాపికలు, ప్రమాణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా.నళిని, వీణ, ప్రమీల, డా.సుధ, డా.టోనియా. డా.చైతన్య పాల్గొన్నారు.

సంస్కృత భాష సనాతనమైనది

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 21: సనాతనమైన సంస్కృత భాషలోనే వేద, పురాణాలు, ఉపనిషత్తులు, భగవద్గీతాదులు రచించారని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ (జగద్గురు పీఠం) డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. మాస్టర్ ఇ.కె. సంస్కృతి సదన్‌లో సంస్కృత భారతి ఆధ్వర్యంలో తాటిచెట్లపాలెంలోని ట్రస్ట్‌లో మహిళలకు 20 రోజులునిర్వహించిన సంస్కృత ప్రవేశ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం జరిగింది. దీనికి హాజరైన జానపద ఉపాధ్యక్షురాలు కందుకూరి సూర్యకుమారి, శిక్షకురాలు బి.వందనలు మాట్లాడారు. అనంతరం పీఠం నిర్వాహక బృందం వందనను సత్కరించింది. సంస్కృత పుస్తకాలను విద్యార్థులకు సత్యదేవ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ బి.ఉషారాణి, దాట్ల రాధ, సంస్కృత భారతి, ఉపాధ్యాయినులు శీలామంతుల సంధ్యారాణి, పసుమర్తి తుషితా పాల్గొన్నారు.

బొడ్డేటి కుటుంబానికి నేతల పరామర్శ

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 21: గ్రేటర్ 43వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బొడ్డేటి మోహన్‌రావును విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు, ఉత్తర నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్, విశాఖ పార్లమెంట్ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆకిరెడ్డి జగదీష్‌లు శనివారం పరామర్శించారు. జగన్నాథపురంలో జరిగిన మోహన్‌రావు తల్లి ఈశ్వరమ్మ పెద్దకర్మ కార్యక్రమానికి విచ్చేసిన వీరంతా నివాళులర్పించారు.

మురళీనగర్‌లో త్రుటిలో తప్పిన ప్రమాదం

మురళీనగర్, సెప్టెంబరు 21; విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎన్‌జీజీఓస్ కాలనీ మెయిన్‌రోడ్డులో శనివారం భారీ వాహనం అదుపు తప్పి లోడుతో రోడ్డుపక్క గొయ్యిలో ఒరిగిపోయింది. నిత్యం రద్దీగా ఉండే ఈ దారిలో ఆ సమయంలో వాహనాలు, బస్సులు కొద్ది దూరంలో వేగాన్ని నియంత్రించడంతో ప్రమాదం తప్పింది. గోతిలో ఇరుక్కున్న సమయంలో ఆ లారీ డ్రైవరు ఒక్కసారిగా ముందుకు ఒత్తిడిగా నడపడంతో మెయిన్ రోడ్డులో వాహనదారులు ఉలిక్కిపడ్డారు. పొరపాటున ఎక్స్‌లేటర్ వేగం పెరిగి వాహనం ముందుకు దూసుకొచ్చి ఉంటే ప్రయాణికుల్ని ఢీకొట్టేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. రోడ్డు మలుపులో, మెయిన్ రోడ్డు కొంత భాగం, పోర్టు భూమి ఆక్రమించి కొందరు నిర్మాణ సామగ్రిని పోగు చేసి వ్యాపారం చేస్తున్నారు. వీరి వ్యాపారం తీరు బాటసారులకు ప్రాణ సంకటంగా మారింది. రోడుకు ఓ పక్కగా ఇసుక కుప్పలు, కంకర, ఇటుకలు పోసి వ్యాపారం చేస్తుండటంతో అటుగా రాకపోకలు సాగించే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. శనివారం ఉదయం రద్దీ వేళలో ప్రమాదం జరిగినా అదృష్టవశాత్తూ, లారీ డ్రైవరు చాకచక్యంగా వాహనాన్ని అదుపు చేయగలిగాడు. వీరు వ్యాపారం చేస్తున్న రోడ్డు పక్కనే ఎగువన సీఐఎస్ఎఫ్ క్వార్టర్ల నుంచి కనెక్ట్ అయిన పురాతన సెప్టిక్ ట్యాంక్ గొయ్యి ఉంది. దాన్ని సరిగా పూడ్చకుండా వదిలేశారు. లోడుతో వచ్చిన వాహనం ఇదే గోతిలో దిగబడి గాల్లో తేలినట్లు ఉండిపోయింది. సగభాగం నేలలో కూరుకుపోయింది. ఆనక లోడు ఖాళీ చేసి, సాయంత్రానికి వాహనాన్ని ట్రాక్టర్లతో బయటకు లాగారు.



ప్రమాదంలో మెయిన్ రోడ్డులో పక్కకు ఒరిగిన లోడు లారీ

క్రీడారంగాభివృద్ధికి ప్రణాళికలు

త్రోబాల్ టోర్నీ ప్రారంభ సభలో ఎలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 21: విశాఖ జిల్లా త్రోబాల్ అసోసియేషన్ నిర్వహిస్తున్న శ్రీమతి ఇంద్రాణి జగ్గారావు స్మారక 34వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర, బాలికల త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక జీవీఎంసీ ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ఎలమంచిలి శాసనసభ్యుడు సుందరపు విజయ్‌కుమార్, విశిష్ట అతిథిగా ఏవీఎన్ కాలేజి కరస్పాండెంట్ ఆదీప్ బానోజీరావు, ద ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ, జీవీఎంసీ స్పోర్ట్సు డైరెక్టర్ అప్పలరాజు పాల్గొని ప్రారంభించారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడారంగాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేసి ఉన్నత స్థాయి టోర్నీలలో ప్రతిభ చూపినవారికి ప్రోత్సాహకాలు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందన్నారు. అలాగే మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. క్రీడా కేంద్రంగా రూపాంతరం చెందుతున్న విశాఖలో రాష్ట్ర స్థాయి త్రోబాల్ నిర్వహించడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏవీఎన్ కాలేజి ప్రిన్సిపాల్ సింహాద్రి నాయుడు, జిల్లా త్రోబాల్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.గోపీకృష్ణ, రాష్ట్ర త్రోబాల్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

'కూటమిలోకి రాలేక వాసుపల్లి కొత్త డ్రామా'

సీతంపేట, సెప్టెంబరు 21: మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ టీడీపీ, జనసేనలలో ఏదో ఒక పార్టీలో చేరడానికి చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో జగన్, వైవీ సుబ్బారెడ్డిలపై పొగడ్తల డ్రామా ఆడుతున్నారని జనసేన ఉత్తరాంధ్ర కో-కన్వీనర్, జనసేన పార్టీ కార్పొరేటర్ మహ్మద్ సాదిక్ పేర్కొన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన నగర పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సాదిక్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లికి ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పి ఇంటికి పంపారని, ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అక్రమాలు బయటకు వస్తాయని, చర్యలకు సిద్ధంగా ఉండాలన్నారు. వాసుపల్లి గతంలో హౌసింగ్ స్కాం చేశారని ఆరోపించారు. ఈ సమావేశంలో సూరాడ తాతారావు, మీసాల వెంకట్ రావు, మేడిశెట్టి రమణ, మోతి పాల్గొన్నారు.

ఏడుగుళ్ల ప్రాంతంలో పక్కాగృహాలు నిర్మించాలి

జ్ఞానాపురం, సెప్టెంబరు 21: స్థానిక 32వ వార్డులోని ఏడుగుళ్ల ప్రాంత నివాసితులకు పక్కాగృహాలు నిర్మించాలని కోరుతూ కార్పొరేటర్, జనసేన నాయకుడు కందుల నాగరాజు శనివారం జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. 75 ఏళ్ల నుంచి అభివృద్ధికి దూరంగా ఉన్న ఈ ప్రాంతానికి న్యాయం చేయాలని కోరారు. నేరెళ్ల కోనేరు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు కల్యాణ మండపం, ఆటస్థలం అభివృద్ధి చేయాలని కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందించారని నాగరాజు తెలిపారు.

కనకమహాలక్ష్మికి తులసీదళార్చనలు

జగదాంబ కూడలి, సెప్టెంబరు 21: భక్తుల పాలిటి కల్పవల్లిగా పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మీ అమ్మవారిని శనివారం తులసీదళాలతో అర్చించారు. ఉదయం వేదపండితులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈ పూజలో పాల్గొనదలచిన భక్తులు రూ.1,500 రుసుం చెల్లించాల్సి ఉంటుందని ఈవో శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. ఉచిత అన్నప్రసాద వితరణ జరిగింది.

ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్

... 5వ పేజీ తరువాయి

వచ్చింది. చివరకు అగనంపూడిలో ఇసుక పూర్తిగా అయిపోవడంతో డిపోను మూసివేశారు. ఈలోగా ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభం కావడంతో రీచ్‌ల నుంచి నేరుగా తెచ్చుకునేందుకు అవకాశం ఏర్పడింది. అయితే టన్ను, రెండు టన్నులు అవసరం ఉన్నవారు శ్రీకాకుళం నుంచి తెచ్చుకోలేరని, ఎక్కువ ఇసుక అవసరం ఉన్నవారికి మాత్రం ధర విషయంలో వెసులుబాటు ఉందని అంటున్నారు. కొద్ది మొత్తంలో ఇసుక అవసరమైతే గతంలో మాదిరిగానే టన్నుకు రూ.1500 నుంచి రూ.1800 వరకు వెచ్చించాల్సి వచ్చేలా ఉందంటున్నారు. ఉత్తరాంధ్రలో విశాఖ నగరంలోనే ఇసుక వినియోగం ఎక్కువ ఉంటుంది. నెలకు సగటు 20 వేల నుంచి 30 వేల టన్నులు అవసరం అవుతుంది. సీజన్‌లో 30 టన్నులు దాటితే, వర్షాకాలంలో 20 టన్నుల వరకు అవసరం అవుతుందని సివిల్ ఇంజనీర్ ఒకరు పేర్కొన్నారు.

పెద్ద దిక్కులేని జల వనరుల శాఖ

... 5వ పేజీ తరువాయి

ఎస్ఈగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

తుఫాన్ల సీజన్‌లో ఉత్తరాంధ్రలో ఎక్కువ వర్షాలు కురుస్తుంటాయి. ఇటువంటి తరుణంలో ఉమ్మడి జిల్లాతోపాటు విజయనగరం జిల్లాలో ఒక డివిజన్‌లోని రిజర్వాయర్లలో నీటి నిల్వలపై కీలక నిర్ణయం తీసుకునే అధికారి అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అత్యవసర పనులకు సంబంధించిన ప్రతిపాదనలపై సంతకం చేసేందుకు సర్కిల్ అధికారి లేరు. సర్కిల్ పరిధిలో ఈనెల 22వ తేదీలోగా ఉద్యోగులు, దిగువస్థాయి అధికారుల బదిలీలు నిర్వహించాల్సి ఉంది. ఆ బాధ్యత కూడా ఎస్ఈదే. ఎస్ఈ లేనందున ఆ బాధ్యతను ఎవరికి అప్పగించాలో ఉన్నతాధికారులు ఇంతవరకూ నిర్ణయం తీసుకోలేదు. తక్షణమే ఎస్ఈ పోస్టులో పూర్తిస్థాయి అధికారిని నియమించాలి...లేనిపక్షంలో కనీసం సమాన హోదా కలిగిన అధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలి. కాగా గత ఏడాది వరకు విశాఖపట్నంలో ఉన్న డివిజన్ కార్యాలయాన్ని నర్సీపట్నం తరలించారు. డివిజన్‌లో ఈఈ పోస్టు సుమారు ఏడాది నుంచి ఖాళీగానే ఉంది. నర్సీపట్నం డిప్యూటీ ఈఈకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

స్వీట్స్‌లోనూ కల్తీ నెయ్యే?

... 5వ పేజీ తరువాయి

పదార్థానికి విక్రేతలు గడువు తేదీ వేయాలి. ఆ నిబంధనను స్వీటు షాపులు కూడా పాటించాలని గతంలో ప్రభుత్వం ఆదేశించింది. కొన్నాళ్లు పెద్ద పెద్ద స్వీటు షాపుల వారు ఈ నిబంధన పాటించారు. ఆ తరువాత గాలికి వదిలేశారు. ఇప్పుడు ఏ షాపులోను ఈ బోర్డులు కనిపించడం లేదు. వాస్తవానికి స్వచ్ఛమైన నెయ్యితో తయారైన స్వీట్లు మెత్తగా ఉండి ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. కల్తీ నెయ్యితో తయారుచేసినవి ఒక్కరోజులోనే ఎండిపోయి రుచిని కోల్పోతాయి. నగరంలో చాలా స్వీటు షాపుల్లో కల్తీ నెయ్యినే వాడుతున్నారు.

నెయ్యిలో ఏమి కలుపుతారంటే..?

నెయ్యిని తక్కువ ధరకు అమ్మడానికి అందులో డాల్డా, పామాయిల్, జంతువుల కొవ్వు కలుపుతారు. కొన్నిసార్లు రిఫైన్డ్ నూనెలు, రసాయనాలు, కలర్ కోసం రంగులు, నిల్వ చేయడానికి అవసరమైన ప్రిజర్వేటివ్‌లు కలుపుతారు.

ఎలా గుర్తించాలంటే...

కల్తీ నెయ్యి రంగు వేరుగా ఉంటుంది. చూడగానే తెలిసిపోతుంది. దీనికి రుచి, వాసన ఉండవు. సీసాలో పైన ఆయిల్ తేలుతూ కిందన పదార్థంలా పేరుకుపోతుంది. వేడి చేస్తే పూర్తిగా కరగదు. కొంత అలాగే ఉండిపోతుంది.

కల్తీ నేయితో నష్టాలు

• అజీర్ణ సమస్యలు, • అలర్జీ, • రంగు కలపడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.

మొక్కలే జీవకోటికి ప్రాణాధారం

▸▸ ప్రొ.వీఎస్ఆర్కే ప్రసాద్



మొక్క నాటుతున్న ప్రొ. ప్రసాద్, డా.కె.వి.రమణ తదితరులు

కంచరపాలెం, సెప్టెంబరు 21: మొక్కలే జీవకోటికి ప్రాణాధారమని ప్రొ. వీఎస్ఆర్కే ప్రసాద్ పేర్కొన్నారు. లయన్స్ క్లబ్, ప్రభుత్వ కెమికల్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం కెమికల్ పాలిటెక్నిక్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొ.వీఎస్ఆర్కే ప్రసాద్ మొక్కలు నాటారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు స్వచ్ఛతా హి కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటుతామన్నారు. మానవాళి మనుగడకు మొక్కలే ఆధారమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, మాజీ ప్రిన్సిపాల్ డా.బి.దేముడు, డా. బీవీలక్ష్మణరావు, డా.ప్రశాంత కుమారి, ప్రొ.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న జెడ్సీ శేషాద్రి, తదితరులు

స్వచ్ఛ సంకల్పంలో ప్రజలంతా భాగస్వాములవ్వాలి: జెడ్సీ శేషాద్రి

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 21: ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, ప్రజలందరూ ఈ మహోద్యమంలో భాగస్వాములు కావాలని గాజువాక జెడ్సీ బుద్దా రామసత్య శేషాద్రి అన్నారు. 70వ వార్డు డ్రైవర్స్ కాలనీలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేరుగా అందించడం, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మొక్కల పెంపకం, ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల వాడక నిషేధం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజలు ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓహెచ్ కిరణ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, కూటమి నాయకులు చట్టి గోపి, కేవీఎస్ శంకరరావు, బి.రమణ, దేనంకొండ పావని, కృష్ణంరాజు, పీఎంఎల్ నాయుడు, లంకల మురళీదేవి, కేవీ సూరి బాబు, తదితరులు పాల్గొన్నారు.

మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక, సెప్టెంబరు 21: సీఐటీయూ అఖిలభారత నాయకుల పిలుపు మేరకు ఈ నెల 30న చేపట్టనున్న మహా ధర్నాకు సంబంధించిన పోస్టరును శనివారం ఇక్కడి సిటూ కార్యాలయంలో నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, తదితర అంశాలతో ఈ నెల 30న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టనున్న ధర్నాను కార్మికులంతా విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అప్పారావు, రాము, నాగరాజు, సత్యవతి, రాజు, చిన్నారావు, సూర్యనారాయణ, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

నవయుగ సాహితీవేత్త 'గురజాడ'

గాజువాక, సెప్టెంబరు 21: నవయుగ వైతాళికులు, సాహితీవేత్త గురజాడ అప్పారావు అని జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు పేర్కొన్నారు. గురజాడ అప్పారావు జయంతిని నడుపూరు హైస్కూల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక విద్యార్థులలో సైన్స్‌పై ఆసక్తి కల్పించేందుకు జాతీయోద్యమ నాయకులు, సంఘ సంస్కర్తల జీవిత చరిత్రను తెలియజేయడం జరుగుతుందన్నారు. అనంతరం జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. అనంతరం ఈ నెల 25 నుంచి నిర్వహించనున్న చెకుముకి పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు ఎస్‌వీకే పరశురాం, డి.వెంకటరావు, డిల్లీరావు, హెచ్ఎం రాచకొండ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

పెందుర్తి, సెప్టెంబరు 21: గ్రేటర్ 97వ వార్డు పరిధిలో గల పారిశుధ్య కార్మికులకు చినముషిడివాడలోని హెల్త్ సెంటర్‌లో శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్పొరేటర్ సేనాపతి వసంత ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ముందుగా అంబేడ్కర్ కాలనీలో ప్రభుత్వం వంద రోజుల పాలనపై ఇంటింటి ప్రచారం చేశారు. టీడీపీ నేత సేనాపతి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి రూరల్: గ్రేటర్ 95వ వార్డు పురుషోత్తపురం అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో స్వచ్ఛతాహి కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. వార్డు పరిధిలోని పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్పొరేటరు ముమ్మన దేముడు వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **వత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 51, టమాటా 42, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 36, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 42, బీరకాయలు 48, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 24, క్యారెట్ 37, దొండకాయలు 32, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 105, మునక్కాడలు (కిలో) 56, బరబాటి 48, ముల్లంగి 38, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 44, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 44, కీరదోస 32, క్యాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 60, దేముడుచిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	95
ఫారం ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



65వ వార్డులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు



పారిశ్రామిక ప్రాంతంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలన భేష్

దీపావళి నుంచి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

పలుచోట్ల ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాల నిర్వహణ



సుజాతనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెదగంట్యాడ, సెప్టెంబరు 21: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుందని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 65వ వార్డు పరిధి వికాస్‌నగర్ రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం ఆవరణలో శనివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలు నలిగిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి, అభివృద్ధిని పక్కన పడేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి రాష్ట్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పారదర్శకంగా సేవలందిస్తూ ప్రజల మన్నన పొందుతుందన్నారు. అనంతరం వందరోజుల పాలనకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జెడ్సీ శేషాద్రి, కూటమి నాయకులు కోన తాతారావు, కరణంరెడ్డి నరసింగరావు, జి.అప్పారావు, తిప్పల రమణారెడ్డి, ప్రసాదుల శ్రీనివాస్, పులి వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

అక్కిరెడ్డిపాలెం: దీపావళి నుంచి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీని ప్రారంభిస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో మెగా డీస్సీ, పెన్షన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం, తదితర సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. 68వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అన్యాయంపై ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించి నియంత పాలన సాగించిందని విమర్శించారు. కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్, నాయకులు గండి కోట తాతారావు, సర్వసిద్ధి అనంతలక్ష్మి, ప్రసాదుల శ్రీనివాసరావు, కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే 69 వార్డు హరిజన జగ్గయ్యపాలెం కాలనీలో టీడీపీ వార్డు అధ్యక్షుడు అలమండ రాజు కూటమి నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు.

జనం మెచ్చేలా పాలన: ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి/వేపగుంట: జనం మెచ్చేలా కూటమి ప్రభుత్వ పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. 95వ వార్డు సుజాతనగర్ ఎనభై అడుగుల రోడ్డు వద్ద ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటింటికీ ఎమ్మెల్యేతో పాటు నాయకులు వెళ్లి వంద రోజుల పాలన గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ అరాచకాలకు విముక్తిగా రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, కూటమి నాయకులు గొర్లె రామునాయుడు, ఐతి సింహాచలం, దాట్ల మధు, కంచిపాటి మధు, పి.పార్వతి, జెడ్సీ హైమవతి, తహసీల్దార్ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు. అలాగే 93వ వార్డు ప్రహ్లదపురంలోని జీవీఎంసీ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో పంచకర్ల మాట్లాడుతూ వందర రోజుల్లో ఎన్నో హామీలను అమలు చేసి కూటమి ప్రభుత్వం ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారాన్ని భారం మోపి, ఆస్తుల విధ్వంసం, కక్ష సాధింపులపై దృష్టిసారించి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. కార్యక్రమంలో స్పెషల్ నోడల్ అధికారి శేష శైలజ, కార్పొరేటర్ రాపర్తి కన్నా శైలజ, ఈఈ రత్నాకర్‌రెడ్డి, ఏపీడీ శ్రీరామ్, శానిటరీ సూపర్‌వైజర్ ఎస్.వి.రమణ, నాయకులు వరహాలు, మహేశ్, బంటు సురేశ్, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మెప్పు పొందుతూ ముందుకు.. ఎమ్మెల్యే పి.గణబాబు

మల్కాపురం/సింధియా: వందరోజుల్లో కూటమి ప్రభుత్వం ప్రజల మెప్పు పొందుతూ అభివృద్ధి దిశగా దూసుకువెళ్తోందని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. శ్రీహరిపురం, 62వ వార్డు త్రినాథపురం, 63వ వార్డు క్రాంతినగర్‌ల్లో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వందరోజుల్లో సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. వైసీపీ పాలనలో అన్ని శాఖలు నాశనమయ్యాయని అన్నారు. తమ ప్రభుత్వ పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, భవిష్యత్తులో వైసీపీ పార్టీ కనుమరుగవుతుందన్నారు. ఈ సందర్భంగా ఇటీవల విజయవాడ వరద బాధిత ప్రాంతాల్లో సేవలందించిన పలువురి పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో 63వ వార్డు కార్పొరేటర్ గల్లా పోలిపిల్లి (చిన్నా), కూటమి నాయకులు పాల్గొన్నారు.

అక్టోబరు నుంచి కొత్త పింఛన్ల పంపిణీ

ఆర్పీపేట (కంచరపాలెం): వచ్చే నెల నుంచి కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. 57వ వార్డు పరిధి ఐటీఐ జంక్షన్ వద్ద నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, నాయకులు పెంటకోట అజయ్‌బాబు, కార్తీక్, జెడ్సీ రాము, డీఈ ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

రామరాజ్య పాలన చంద్రబాబుకే సాధ్యం

కూర్మన్నపాలెం: రాష్ట్రంలో రామరాజ్య పాలనను అందించే సత్తా సీఎం చంద్రబాబుకే సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. వడ్లపూడిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో ఈ ఐదేళ్లలో ప్రజా రంజక పాలనను ప్రజలు చూస్తారన్నారు. నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, ప్రగడ దానయ్య, గెద్దాడ రాంబాబు, ఎస్.పెంటారావు, పి.కృష్ణ, రాజన్‌రాజు, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు. అలాగే 88వ వార్డు పరిధి దువ్వాడలో ఇంటింటికీ వెళ్లి వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు వివరిస్తూ కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, తదితరులు కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు ఉరుకూటి శ్రీనివాసరావు, ఎం. ఆర్.పైడి రాజు, ఒమ్మి రాము, చట్టి రాము, తదితరులు పాల్గొన్నారు.

70వ వార్డులో కరపత్రాల పంపిణీ

ఆటోనగర్: జీవీఎంసీ 70వ వార్డు ఎల్‌వీ నగర్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి కూటమి నాయకులు పంపిణీ చేయడంతో పలు ఇళ్ల గోడలపై అతికించారు. ఈ సందర్భంగా నాయకులు చట్టి గోపి, కేవీఎస్ శంకరరావులు మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా చంద్రబాబు సూపర్ సిక్స్ హామీల్లో ఐదు పథకాలను ఇప్పటికే అమలు చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు పావని, దేనంకొండ కృష్ణంరాజు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

పురుషోత్తపురంలో..

పెందుర్తి-రూరల్: గ్రేటర్ 94వ వార్డు పరిధి పురుషోత్తపురంలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ 100 రోజుల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనుయాదవ్, జనసేన నాయకుడు పిళ్లా జగన్మోహనపాత్రుడు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కరప త్రాలు అందించారు. సీం చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.

52వ వార్డులో..

ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ 52వ వార్డులో కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై టీడీపీ వార్డు అధ్యక్షుడు మందరపు వాసుదేవరావు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఇది మంచి ప్రభుత్వం అంటూ ఇళ్లకు స్టిక్కర్లను అతికించారు. నాయకులు సూర్యనారాయణ, వాసుదేవరావు, పి.టి.నాయుడు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీరామ్‌నగర్ కాలనీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయడంతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కూటమి నాయకులు కోటేశ్వరరావు, సర్వసిద్ధి సన్యాసిరాజు, రామారావు, డి.అర్జున్, తాతారావు, రమణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే 85వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కర్రి దేశేంద్ర ఆధ్వర్యంలో ఫార్మాసిటీ పునరావాస కాలనీ, కొండయ్యవలస, దిబ్బపాలెం, పెదమడక ప్రాంతాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్పొరేటర్ వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమానికి ఉక్కు యాజమాన్యం కృషి చేయాలి

బ్లాస్ట్ ఫర్నేస్ విభాగం ఇంటక్ నాయకులు



బ్లాస్ట్ ఫర్నేస్ విభాగాధిపతి బీవీకే రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఇంటక్ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 21: ఉక్కు యాజమాన్యం కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేసి, కార్మిక సంక్షేమంపై దృష్టి సారించాలని బ్లాస్ట్ ఫర్నేస్ విభాగం ఇంటక్ నాయకులు పేర్కొన్నారు. విభాగాధిపతి బీవీకే రెడ్డితో విభాగం ఇంటక్ కమిటీ నాయకులు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బార్క్ కమిటీ నిర్ణయం మేరకు రెండు పర్మిషన్‌లు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. భారీ వర్షాలకు రోడ్లన్నీ మరమ్మతులకు గురయ్యాయని, తక్షణమే వాటిని బాగుచేయాలని కోరారు. లోడింగ్, అన్ లోడింగ్ ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పోలీస్ నాయుడు, పీవీ నగేశ్, సత్యారావు, పోతారెడ్డి, అప్పారావు, రమణ, సుబ్బరాజు, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీజీఎం (వర్క్స్) యు.శ్రీధర్‌కు ఉక్కు కార్మిక సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులకు ఈ నెల జీతాలు ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులకు పెండింగ్ జీతాలను తక్షణమే చెల్లించాలని, పని ప్రదేశంలో కార్మికులకు పని భద్రతకు చెందిన పనిముట్లు ఇవ్వాలని కోరారు. ప్లాంటుకు పూర్వ వైభవాన్ని తీసుకుచ్చేందుకు తీసుకునే చర్యలకు పూర్తి సహకారాన్ని అందిస్తామని పేర్కొన్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా దసరా ముందు బోనస్ ఇవ్వాలని, ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేందుకు తమ వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు. నాయకులు మార్టుపూడి పరదేశి, నక్కా వెంకటరమణ, పిట్టా రెడ్డి, రవి, విజయ్‌కుమార్, అప్పలరాజు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఎస్ఎన్ఎల్ ప్రైవేటీకరణ దుర్మార్గం

ఫెర్రో స్క్రాప్ నిగమ్ లిమిటెడ్ (ఎఫ్ఎస్ఎన్ఎల్) సంస్థను ప్రైవేటీకరణ చేయడం అత్యంత దుర్మార్గమని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ప్లాంట్ ఎఫ్ఎస్ఎన్ఎల్ విభాగం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్ఎస్ఎన్ఎల్‌ను ప్రైవేటీకరిస్తామని కేంద్రం చెప్పి ప్రైవేటు వ్యక్తులకు అమ్మడం సరికాదన్నారు. మంచి లాభాలతో ఉన్న సంస్థను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారని, ఇది కేంద్రం తీసుకున్న దుర్మార్గ నిర్ణయమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు తీరని లోటన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ము కాస్తుందని, ప్రభుత్వం తమ తీరు మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని హెచ్చరించారు. నాయకుడు పీవీ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు మొక్కలు నాటాలి

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 21: కాలుష్య నివారణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఏపీ రాష్ట్ర వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పప్పు రాజారావు అన్నారు. 71వ వార్డు కుంచుమాంబ కాలనీ రోడ్డులో ఏపీఐఐసీ ఐలా, ఎంఎస్ఎంఈ సౌజన్యంతో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలోనే ఎన్నో ఎన్నికల హామీలను నెరవేర్చిందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ఎవరూ ప్లాస్టిక్‌ను వినియోగించరాదన్నారు. కాలనీ పెద్దలు సన్యాసిరావు, నాయుడు, బాబూరావు, తాతారావు, కోటేశ్వరరావు, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసునికి తులసీ దళార్చన



పెదగంట్యాడ, సెప్టెంబరు 21: జీవీఎంసీ 65వ వార్డు పరిధి వాంబే కాలనీ కొండపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునికి శనివారం తులసీ దళార్చన చేశారు. సుప్రభాత సేవ తర్వాత స్వామివారిని అభిషేకించి, తులసి మాలలతో అలంకరించాక తులసీ దళార్చన చేశారు. పరిసర కాలనీలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో శ్రీవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు.

వేపగుంట: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కొలవైన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని స్వర్ణ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. సాయంత్రం సామూహిక భక్తి గీతాలు, విష్ణుసహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పఠించారు.



'మేహాద్రిగెడ్డ' నుంచి నీరు విడుదల

గోపాలపట్నం, సెప్టెంబరు 21: మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ గేటు ఎత్తి వరద నీటిని శనివారం విడుదల చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రిజర్వాయర్ నీటిమట్టం 59.7 అడుగులకు చేరడంతో వారం రోజుల క్రితం రిజర్వాయర్ గేటును ఎత్తి నీటిని విడుదల చేశారు. కాగా రెండు రోజుల క్రితం ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ఇన్‌ఫ్లో పెరిగి జలాశయం నీటిమట్టం 59.7 అడుగులకు చేరడంతో శనివారం ఉదయం మూడో నంబరు గేటును సుమారు మూడంగుళాల మేర ఎత్తి 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తిరిగి రిజర్వాయర్ నీటిమట్టం 59.4 అడుగులకు చేరగానే గేటును దించుతామని అధికారులు పేర్కొన్నారు.

గణనాథునికి లక్ష ఉండ్రాళ్ల నైవేద్యం



కణితి కాళింగుల వీధిలో గణేశునికి నివేదించిన ఉండ్రాళ్లు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 21: జీవీఎంసీ 87 వార్డు కణితి కాళింగుల వీధిలో ప్రతిష్ఠించిన గణనాథుని మండపంలో శనివారం భక్తులు లక్ష ఉండ్రాళ్లను స్వామివారికి నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. అనంతరం ప్రసాదంగా ఈ ఉండ్రాళ్లను వార్డులోని ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు ప్రగడ వేణుబాబు, ఎస్ఎస్ విజయరామరాజు, ప్రగడ శంకరరావు, దుగ్గపు దానప్ప, పి.శ్రీను, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్జీ పాలిమర్స్ బాధితులకు పరిహారం పంపిణీ

గోపాలపట్నం, సెప్టెంబరు 21: ఎల్జీ విషవాయువు లీకేజీ ఘటనలో బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం లభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో బాధితులను ఆదుకునేందుకు కంపెనీ యాజమాన్యం ముందుకు వచ్చింది. దీనిలో భాగంగా రెండు దశల్లో రూ.120 కోట్లతో అదనపు పరిహారం చెల్లింపుతోపాటు, విషవాయువు ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు యాజమాన్యం అంగీకరించిన సంగతి విదితమే. ఈ మేరకు వెంకటాపురం, కంపరపాలెం, పద్మనాభపురం గ్రామాల పరిధిలోని 6,121 కుటుంబాలకు పరిహారం పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. ఎల్జీ పాలిమర్స్ విషవాయువు ఘటనలో రెడ్‌జోన్‌గా గుర్తించిన ప్రాంతంలో ఉన్న కుటుంబానికి రూ.3.50 లక్షలు, విషవాయువు ప్రభావిత ప్రాంతాల్లోని కుటుంబాలకు రూ.50 చొప్పున బాధితుల బ్యాంక్ ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్నారు. ఇప్పటికే చాలా మంది బాధితులకు నగదు జమ చేశారు. ప్రమాదం జరిగిన నాలుగేళ్ల తరువాత కూటమి ప్రభుత్వం పాలనలో బాధితులకు ఆర్థిక సాయం అందించంపై బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గాలులకు కూలిన విద్యుత్ స్తంభం



చెట్టుపై కూలిన స్తంభం

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 21: జీవీఎంసీ 86 వార్డు శాతవాహననగర్ రావుల చెరువు వాకింగ్ ట్రాక్ వద్ద శనివారం సాయంత్రం వీచిన గాలులకు చెట్టుపై విద్యుత్ స్తంభం కూలిపోయింది. దీంతో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఆ సమయంలో వాకర్స్ ఎవరూ లేకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. వాకింగ్ ట్రాక్ ప్రతినిధులు ఇచ్చిన సమాచారంతో విద్యుత్ అధికారులు కరెంట్ సరఫరా నిలిపి వేశారు.

'పల్లా'ను కలిసిన అంబేడ్కర్ గ్లోబెల్ మిషన్ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 21: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన క్రిమిలేయర్ తీర్పును పునఃపరిశీలించాలని బీఆర్ అంబేడ్కర్ గ్లోబెల్ మిషన్ తరపున సుప్రీంకోర్టులో పిటిషన్ వేశామని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్లరాదని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు మిషన్ రాష్ట్ర నాయకులు, ఉక్కు నాయకులు శనివారం గాజువాకలో వినతిపత్రం అందజేశారు. మిషన్ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు నంబర్ కేటాయించిందని, దీనిపై తదుపరి తీర్పు వచ్చేంత వరకు రాష్ట్రం ముందుకు వెళ్లకుండా చూడాలని కోరారు. పల్లాను కలిసిన వారిలో నాయకులు బయ్యే మల్లయ్య, దాకే సువర్ణరత్నం, ఎస్.మోహన్‌బాబు, డి.పుల్లారావు, తదితరులు ఉన్నారు.

అల్జీమర్స్ వ్యాధిపై అవగాహన ఉండాలి

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 21: అల్జీమర్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ప్రముఖ న్యూ రాలజిస్ట్ సీహెచ్ విజయ్ అన్నారు. ప్రపంచ అల్జీమర్స్ వ్యాధి దినం సందర్భంగా షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ మాట్లాడారు. అల్జీమర్స్ నిరోధానికి సరైన ఆహార నియమాలు, వ్యాయామం తదితర ఆరోగ్య సూత్రాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

అత్యంత వైభవంగా సంకష్టహర చతుర్థి

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 21 : పోర్టు ఆస్పత్రి ఎదురుగా నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న లక్ష్మీ వినాయక ఆలయంలో సంప్రదాయ రీతిలో శనివారం రాత్రి సంకష్టహర చతుర్థి అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు శివశ్రీ బాలానంద శివాచార్య స్వామి సారథ్యంలో శైవ ఆగమ సంప్రదాయంలో అభిషేకాలు, లక్ష్మీ వినాయక హోమం, అర్చనలు, ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, గురుపాద సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

భూదాన్ భూములు కాపాడాలి

మహారాణిపేట, సెప్టెంబరు 21: భూదాన్ యజ్ఞ భూములను కాపాడాలని ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండల్ అధ్యక్షుడు ఎస్.రాంబాబు నాయుడు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం మండలి సభ్యులు కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందించారు. చిన్నగదిలి మండలం పరదేశీపాలెంలోని భూదాన్ భూమి ఆక్రమణకు దళారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు. కొంతమంది నాయకుల అండతో నకిలీ పత్రాలు సృష్టించి తమ సొంత భూమిగా మార్చుకోవాలని చూస్తున్నారని ఆంధ్రప్రదేశ్ భూదాన్ యజ్ఞ బోర్డు పేరుతో నకిలీ ప్రొసీడింగ్స్ తయారు చేసి వాటిని ఇళ్ల స్థలాలుగా అమ్ముకుంటున్నారని తెలిపారు. కలెక్టర్‌ను కలిసినవారిలో డా.దీనబంధు, సభ్యులు ఉన్నారు.

పేదలకు అండగా ఉండే ప్రభుత్వమిది

‘ఇది మంచి ప్రభుత్వం’ కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఉద్ఘాటన



మర్రిపాలెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, చిత్రంలో ఎంపీ శ్రీభరత్, ఇతర నాయకులు



రామాటాకీస్ రోడ్డులో కంటి ఆసుపత్రి వద్ద అన్న క్యాంటీన్ ప్రారంభం సందర్భంగా భోజనం వడ్డిస్తున్న నేతలు

మర్రిపాలెం, సెప్టెంబరు 21: ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వ లక్ష్యమని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. శనివారం గ్రేటర్ పరిధి 53వ వార్డు మర్రిపాలెం ఆర్‌అండ్‌బీ జంక్షన్ వద్ద నిర్వహించిన ‘ఇది మంచి ప్రభుత్వం’ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎంపీ అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం అరాచక పాలన సాగించిందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం తప్పకుండా ప్రజాపాలన సాగిస్తుందన్నారు. టీడీపీ నేతలు గండిబాబ్జీ, పొలమరశెట్టి శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గ జనసేన కన్వీనర్ పసుపులేటి ఉషాకిరణ్, వార్డు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సీతమ్మధార: రామాటాకీస్ రోడ్డు ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి వద్ద అన్న క్యాంటీన్‌ను ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, ఎంపీ శ్రీభరత్‌లు శనివారం ప్రారంభించారు. అనంతరం వడ్డించారు. ఇది పేదలకు అండగా ఉండే మంచి ప్రభుత్వమని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేరుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు గండి బాబ్జి, ఉషాకిరణ్, సురేష్‌బాబు, ఎండీ నజీర్, వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాధవధార; ప్రభుత్వం గత 100 రోజుల్లో చేసిన పనులతో ప్రతి చోట ప్రజానీకం ‘ఇదే మేం కోరుకున్న మంచి ప్రభుత్వమ’ని సంతోషంగా చెబుతున్నారని 51వ వార్డు టీడీపీ అధ్యక్షులు సనపల కీర్తి పేర్కొన్నారు. శనివారం మాధవధార తెన్నేటినగర్‌లో ఇంటింటికీ వెళ్లిన సచివాలయం అధికారులు, వార్డు సీనియరు నాయకులు ప్రభుత్వం వంద రోజుల్లో చేసి చూపించిన సంక్షేమ కార్యక్రమాల్ని వివరించారు. కీర్తి ప్రజల అభిప్రాయాల్ని తెలుసుకున్నారు. 50వ వార్డులో ఆ వార్డు ప్రెసిడెంట్ సనపల వర ప్రసాద్ ఆధ్వర్యంలో సీనియరు నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని జగన్ నాకేశాడు: విష్ణుకుమార్ రాజు

సింహాచలం: అవినీతి ఎక్కడుంటే జగన్మోహన్‌రెడ్డి, అతడి అనుచరులు అక్కడ ఉంటూ రాష్ట్రాన్ని సర్వం నాకేశారని విశాఖ ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు విష్ణుకుమార్‌రాజు విమర్శించారు. అవినీతికి చిరునామాగా ఉండే జగన్ మాటలు పట్టించుకోవాల్సిన పనిలేదన్నారు. శనివారం సాయంత్రం ఆయన సింహగిరికి చేరుకుని తొలుత వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం అప్పన్న ప్రధాన స్టోర్సును సందర్శించి ప్రసాదాల వినియోగంలో వాడుతున్న ముడిసరుకులు, వాటి కొనుగోళ్ల తదితర అంశాలపై అధికారుల నుంచి వివరాలు సేకరించారు. అన్నవరం దేవాలయానికి కిలో నెయ్యి రూ.520లకు సరఫరా అవుతుంటే సింహాచలం దేవాలయానికి మాత్రం రూ.344లకు జీఎస్టీ మినహా సరఫరా చేస్తుండటంపై సమగ్ర విచారణ జరగాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో దేవాలయాల్లో లడ్డూ ప్రసాదాల తయారీలో కల్తీ అంశం కేంద్రం దృష్టికి వెళ్లిందని, ప్రధాని నరేంద్ర మోదీ, జేపీ నడ్డా ఆదేశాల మేరకు తాను సింహగిరికి వచ్చినట్టు తెలిపారు.

తెలుగు సాహితీ జాడ .. మన గురజాడ

జయంతి సభలో వక్తల అక్షర నివాళి



గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

సీతంపేట, సెప్టెంబరు 21: ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగం, సమైక్య భారతి సంయుక్తంగా యుగకర్త మహాకవి గురజాడ వెంకట అప్పారావు 162వ జయంతి వేడుకలను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అసెంబ్లీ హాల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత డాక్టర్ గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు సాహిత్యంలో ఆయనది సుస్థిర స్థానమని పేర్కొన్నారు. ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ గురజాడ స్త్రీ చైతన్యం కోసం చాలా కృషి చేశారని తెలిపారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ ఆధునిక సాహిత్య గురువు, తెలుగు సాహిత్యాన్ని, భాషను చైతన్యం చేసిన మహానుభావుడని శ్లాఘించారు. విప్లవ పంథాలో సమాజాన్ని ముందుకు తీసుకెళ్లిన మహాకవి గురజాడ అన్నారు. ఈ సమావేశంలో ఎల్.మృదుల, డాక్టర్ ఎం.విజయగోపాల్, పి.కన్నయ్య, ఆచార్య సాల్మన్ బెన్ని, ఆచార్య నల్లా సత్యనారాయణ, ఆచార్య గోవాడ వీర్రాజు, ఆచార్య ధనరాజు, ఉప్పల అప్పలరాజు, డాక్టర్ లావణ్య, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ రత్నశేఖర్, డాక్టర్ గిరీష్‌కుమార్, పరిశోధకులు, స్నాతకోత్తర విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహితంగా సాగరతీరం

కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపు



తీరంలో చెత్త ఏరుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, సెప్టెంబరు 21: ఒక్కసారికి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం అంతర్జాతీయ తీర పరిశుభ్రతా దినోత్సవం సందర్భంగా బీచ్‌రోడ్డులో స్వచ్ఛతాహీ సేవా-2024 కార్యక్రమం చేపట్టారు. ఇండియన్ కోస్టుగార్డు ఎకోలాస్టిక్ సంస్థ ఆధ్వర్యంలో సాగరతీరాన్ని శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో కలెక్టర్ స్వయంగా పాల్గొని చెత్త ఏరివేశారు. ఆర్కే బీచ్, రుషికొండ పరిసర ప్రాంతాల్లో వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తీర ప్రాంతంలో కాలుష్యం ఎక్కువ కావటంతో జలరాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, తీరంలో చెత్త వేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను వేయటం ద్వారా తీర కాలుష్యం పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తీరంలో ఏర్పాటు చేసిన సైకత శిల్పం ఆకట్టుకుంది. కోస్టుగార్డు ఉన్నతాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ముగిసిన వినాయక ఉత్సవాలు



దుర్గాగణపతి ఆలయంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక తదితరులు

సీతంపేట, సెప్టెంబరు 21: సీతంపేటలోని దుర్గాగణపతి ఆలయంలో శనివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కుమార్తె శ్యామలదీపిక, వార్డు కార్పొరేటర్, ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి గోవింద్‌లు భక్తులకు ప్రసాద వడ్డన చేశారు. ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో శ్యామలదీపిక పాల్గొన్నారు. ఈఓ రమాబాయి, ఉత్సవ కమిటీ చైర్మన్ గోవింద్ పర్యవేక్షణలో సుమారు ఆరు వేల మందికి అన్నదానం చేశారు.

జ్ఞానాపురం: కాన్వెంట్ కూడలిలోని సౌభాగ్య గణపతి ఆలయం వద్ద వైష్ణవి టోకు కాయగూరల మార్కెట్ వర్తకసంఘం ఆధ్వర్యంలో 15 రోజులు జరిగిన వినాయక ఉత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ముగిశాయి. దక్షిణ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి ఎస్.సుధాకర్, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావులు సౌభాగ్య గణపతిని దర్శించుకున్నారు. కూడలిలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 5 వేల మంది భక్తులు ప్రసాద వితరణలో పాల్గొన్నారు. 18 అడుగుల వినాయక విగ్రహాన్ని కాన్వెంట్ కూడలి నుంచి కంచరపాలెం, తాటిచెట్లపాలెం మీదుగా ఆర్కే బీచ్ వరకు మేళతాళాలు, నృత్యాలతో ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. పలు రకాల రథాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

అంతర కళాశాలల పోటీలు

జ్ఞానాపురం, సెప్టెంబరు 21: సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శనివారం అంతర కళాశాలల పోటీలను ఆంగ్ల విభాగం అధ్యక్షురాలు డా.సుధ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ ప్రారంభించారు. విద్యార్థినులతో పాటు వి.ఎస్.కృష్ణ, గాయత్రి, ఏవీఎన్.సెయింట్ ఏన్స్ తదితర 8 డిగ్రీ కళాశాలల విద్యార్థినులు పోటీపడ్డారు. పలు రకాల పోటీలు నిర్వహించామని షైజీ తెలిపారు. విజేతలైన విద్యార్థినులకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ద్వితీయభాషా విభాగాధిపతి డా.వీకే జయలక్ష్మి జ్ఞాపికలు, ప్రమాణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా.నళిని, వీణ, ప్రమీల, డా.సుధ, డా.టోనియా. డా.చైతన్య పాల్గొన్నారు.

సంస్కృత భాష సనాతనమైనది

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 21: సనాతనమైన సంస్కృత భాషలోనే వేద, పురాణాలు, ఉపనిషత్తులు, భగవద్గీతాదులు రచించారని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ (జగద్గురు పీఠం) డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. మాస్టర్ ఇ.కె. సంస్కృతి సదన్‌లో సంస్కృత భారతి ఆధ్వర్యంలో తాటిచెట్లపాలెంలోని ట్రస్ట్‌లో మహిళలకు 20 రోజులునిర్వహించిన సంస్కృత ప్రవేశ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం జరిగింది. దీనికి హాజరైన జానపద ఉపాధ్యక్షురాలు కందుకూరి సూర్యకుమారి, శిక్షకురాలు బి.వందనలు మాట్లాడారు. అనంతరం పీఠం నిర్వాహక బృందం వందనను సత్కరించింది. సంస్కృత పుస్తకాలను విద్యార్థులకు సత్యదేవ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ బి.ఉషారాణి, దాట్ల రాధ, సంస్కృత భారతి, ఉపాధ్యాయినులు శీలామంతుల సంధ్యారాణి, పసుమర్తి తుషితా పాల్గొన్నారు.

బొడ్డేటి కుటుంబానికి నేతల పరామర్శ

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 21: గ్రేటర్ 43వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బొడ్డేటి మోహన్‌రావును విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు, ఉత్తర నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్, విశాఖ పార్లమెంట్ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆకిరెడ్డి జగదీష్‌లు శనివారం పరామర్శించారు. జగన్నాథపురంలో జరిగిన మోహన్‌రావు తల్లి ఈశ్వరమ్మ పెద్దకర్మ కార్యక్రమానికి విచ్చేసిన వీరంతా నివాళులర్పించారు.

మురళీనగర్‌లో త్రుటిలో తప్పిన ప్రమాదం

మురళీనగర్, సెప్టెంబరు 21; విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎన్‌జీజీఓస్ కాలనీ మెయిన్‌రోడ్డులో శనివారం భారీ వాహనం అదుపు తప్పి లోడుతో రోడ్డుపక్క గొయ్యిలో ఒరిగిపోయింది. నిత్యం రద్దీగా ఉండే ఈ దారిలో ఆ సమయంలో వాహనాలు, బస్సులు కొద్ది దూరంలో వేగాన్ని నియంత్రించడంతో ప్రమాదం తప్పింది. గోతిలో ఇరుక్కున్న సమయంలో ఆ లారీ డ్రైవరు ఒక్కసారిగా ముందుకు ఒత్తిడిగా నడపడంతో మెయిన్ రోడ్డులో వాహనదారులు ఉలిక్కిపడ్డారు. పొరపాటున ఎక్స్‌లేటర్ వేగం పెరిగి వాహనం ముందుకు దూసుకొచ్చి ఉంటే ప్రయాణికుల్ని ఢీకొట్టేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. రోడ్డు మలుపులో, మెయిన్ రోడ్డు కొంత భాగం, పోర్టు భూమి ఆక్రమించి కొందరు నిర్మాణ సామగ్రిని పోగు చేసి వ్యాపారం చేస్తున్నారు. వీరి వ్యాపారం తీరు బాటసారులకు ప్రాణ సంకటంగా మారింది. రోడుకు ఓ పక్కగా ఇసుక కుప్పలు, కంకర, ఇటుకలు పోసి వ్యాపారం చేస్తుండటంతో అటుగా రాకపోకలు సాగించేవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. శనివారం ఉదయం రద్దీ వేళలో ప్రమాదం జరిగినా అదృష్టవశాత్తూ, లారీ డ్రైవరు చాకచక్యంగా వాహనాన్ని అదుపు చేయగలిగాడు. వీరు వ్యాపారం చేస్తున్న రోడ్డు పక్కనే ఎగువన సీఐఎస్ఎఫ్ క్వార్టర్ల నుంచి కనెక్ట్ అయిన పురాతన సెప్టిక్ ట్యాంక్ గొయ్యి ఉంది. దాన్ని సరిగా పూడ్చకుండా వదిలేశారు. లోడుతో వచ్చిన వాహనం ఇదే గోతిలో దిగబడి గాల్లో తేలినట్లు ఉండిపోయింది. సగభాగం నేలలో కూరుకుపోయింది. ఆనక లోడు ఖాళీ చేసి, సాయంత్రానికి వాహనాన్ని ట్రాక్టర్లతో బయటకు లాగారు.



ప్రమాదంలో మెయిన్ రోడ్డులో పక్కకు ఒరిగిన లోడు లారీ

క్రీడారంగాభివృద్ధికి ప్రణాళికలు

త్రోబాల్ టోర్నీ ప్రారంభ సభలో ఎలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 21: విశాఖ జిల్లా త్రోబాల్ అసోసియేషన్ నిర్వహిస్తున్న శ్రీమతి ఇంద్రాణి జగ్గారావు స్మారక 34వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర, బాలికల త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక జీవీఎంసీ ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ఎలమంచిలి శాసనసభ్యుడు సుందరపు విజయ్‌కుమార్, విశిష్ట అతిథిగా ఏవీఎన్ కాలేజి కరస్పాండెంట్ ఆదీప్ బానోజీరావు, ద ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ, జీవీఎంసీ స్పోర్ట్సు డైరెక్టర్ అప్పలరాజు పాల్గొని ప్రారంభించారు. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడారంగాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేసి ఉన్నత స్థాయి టోర్నీలలో ప్రతిభ చూపినవారికి ప్రోత్సాహకాలు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందన్నారు. అలాగే మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. క్రీడా కేంద్రంగా రూపాంతరం చెందుతున్న విశాఖలో రాష్ట్ర స్థాయి త్రోబాల్ నిర్వహించడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏవీఎన్ కాలేజి ప్రిన్సిపాల్ సింహాద్రి నాయుడు, జిల్లా త్రోబాల్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.గోపీకృష్ణ, రాష్ట్ర త్రోబాల్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

‘కూటమిలోకి రాలేక వాసుపల్లి కొత్త డ్రామా’

సీతంపేట, సెప్టెంబరు 21: మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ టీడీపీ, జనసేనలలో ఏదో ఒక పార్టీలో చేరడానికి చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో జగన్, వైవీ సుబ్బారెడ్డిలపై పొగడ్తల డ్రామా ఆడుతున్నారని జనసేన ఉత్తరాంధ్ర కో-కన్వీనర్, జనసేన పార్టీ కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ పేర్కొన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన నగర పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సాధిక్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లికి ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పి ఇంటికి పంపారని, ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అక్రమాలు బయటకు వస్తాయని, చర్యలకు సిద్ధంగా ఉండాలన్నారు. వాసుపల్లి గతంలో హౌసింగ్ స్కాం చేశారని ఆరోపించారు. ఈ సమావేశంలో సూరాడ తాతారావు, మీసాల వెంకట్రావు, మేడిశెట్టి రమణ, మోతి పాల్గొన్నారు.

ఏడుగుళ్ల ప్రాంతంలో పక్కాగృహాలు నిర్మించాలి

జ్ఞానాపురం, సెప్టెంబరు 21: స్థానిక 32వ వార్డులోని ఏడుగుళ్ల ప్రాంత నివాసితులకు పక్కాగృహాలు నిర్మించాలని కోరుతూ కార్పొరేటర్, జనసేన నాయకుడు కందుల నాగరాజు శనివారం జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. 75 ఏళ్ల నుంచి అభివృద్ధికి దూరంగా ఉన్న ఈ ప్రాంతానికి న్యాయం చేయాలని కోరారు. నేరెళ్ల కోనేరు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు కల్యాణ మండపం, ఆటస్థలం అభివృద్ధి చేయాలని కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందించారని నాగరాజు తెలిపారు.

కనకమహాలక్ష్మికి తులసీదళార్చనలు

జగదాంబ కూడలి, సెప్టెంబరు 21: భక్తుల పాలిటి కల్పవల్లిగా పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మి అమ్మవారిని శనివారం తులసీదళాలతో అర్చించారు. ఉదయం వేదపండితులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈ పూజలో పాల్గొనదలచిన భక్తులు రూ.1,500 రుసుం చెల్లించాల్సి ఉంటుందని ఈవో శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. ఉచిత అన్నప్రసాద వితరణ జరిగింది.

ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్

... 5వ పేజీ తరువాయి

వచ్చింది. చివరకు అగనంపూడిలో ఇసుక పూర్తిగా అయిపోవడంతో డిపోను మూసివేశారు. ఈలోగా ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభం కావడంతో రీచ్‌ల నుంచి నేరుగా తెచ్చుకునేందుకు అవకాశం ఏర్పడింది. అయితే టన్ను, రెండు టన్నులు అవసరం ఉన్నవారు శ్రీకాకుళం నుంచి తెచ్చుకోలేరని, ఎక్కువ ఇసుక అవసరం ఉన్నవారికి మాత్రం ధర విషయంలో వెసులుబాటు ఉందని అంటున్నారు. కొద్ది మొత్తంలో ఇసుక అవసరమైతే గతంలో మాదిరిగానే టన్నుకు రూ.1500 నుంచి రూ.1800 వరకు వెచ్చించాల్సి వచ్చేలా ఉందంటున్నారు. ఉత్తరాంధ్రలో విశాఖ నగరంలోనే ఇసుక వినియోగం ఎక్కువ ఉంటుంది. నెలకు సగటు 20 వేల నుంచి 30 వేల టన్నులు అవసరం అవుతుంది. సీజన్‌లో 30 టన్నులు దాటితే, వర్షాకాలంలో 20 టన్నుల వరకు అవసరం అవుతుందని సివిల్ ఇంజనీర్ ఒకరు పేర్కొన్నారు.

పెద్ద దిక్కులేని జల వనరుల శాఖ

... 5వ పేజీ తరువాయి

ఎస్ఈగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

తుఫాన్ల సీజన్‌లో ఉత్తరాంధ్రలో ఎక్కువ వర్షాలు కురుస్తుంటాయి. ఇటువంటి తరుణంలో ఉమ్మడి జిల్లాతోపాటు విజయనగరం జిల్లాలో ఒక డివిజన్‌లోని రిజర్వాయర్లలో నీటి నిల్వలపై కీలక నిర్ణయం తీసుకునే అధికారి అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అత్యవసర పనులకు సంబంధించిన ప్రతిపాదనలపై సంతకం చేసేందుకు సర్కిల్ అధికారి లేరు. సర్కిల్ పరిధిలో ఈనెల 22వ తేదీలోగా ఉద్యోగులు, దిగువస్థాయి అధికారుల బదిలీలు నిర్వహించాల్సి ఉంది. ఆ బాధ్యత కూడా ఎస్ఈదే. ఎస్ఈ లేనందున ఆ బాధ్యతను ఎవరికి అప్పగించాలో ఉన్నతాధికారులు ఇంతవరకూ నిర్ణయం తీసుకోలేదు. తక్షణమే ఎస్ఈ పోస్టులో పూర్తిస్థాయి అధికారిని నియమించాలి..లేనిపక్షంలో కనీసం సమాన హోదా కలిగిన అధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలి. కాగా గత ఏడాది వరకు విశాఖపట్నంలో ఉన్న డివిజన్ కార్యాలయాన్ని నర్సీపట్నం తరలించారు. డివిజన్‌లో ఈఈ పోస్టు సుమారు ఏడాది నుంచి ఖాళీగానే ఉంది. నర్సీపట్నం డిప్యూటీ ఈఈకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

స్వీట్స్‌లోనూ కల్తీ నెయ్యే?

... 5వ పేజీ తరువాయి

పదార్థానికి విక్రేతలు గడువు తేదీ వేయాలి. ఆ నిబంధనను స్వీటు షాపులు కూడా పాటించాలని గతంలో ప్రభుత్వం ఆదేశించింది. కొన్నాళ్లు పెద్ద పెద్ద స్వీటు షాపుల వారు ఈ నిబంధన పాటించారు. ఆ తరువాత గాలికి వదిలేశారు. ఇప్పుడు ఏ షాపులోను ఈ బోర్డులు కనిపించడం లేదు. వాస్తవానికి స్వచ్ఛమైన నెయ్యితో తయారైన స్వీట్లు మెత్తగా ఉండి ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. కల్తీ నెయ్యితో తయారుచేసినవి ఒక్కరోజులోనే ఎండిపోయి రుచిని కోల్పోతాయి. నగరంలో చాలా స్వీటు షాపుల్లో కల్తీ నెయ్యినే వాడుతున్నారు.

నెయ్యిలో ఏమి కలుపుతారంటే..?

నెయ్యిని తక్కువ ధరకు అమ్మడానికి అందులో డాల్డా, పామాయిల్, జంతువుల కొవ్వు కలుపుతారు. కొన్నిసార్లు రిఫైన్డ్ నూనెలు, రసాయనాలు, కలర్ కోసం రంగులు, నిల్వ చేయడానికి అవసరమైన ప్రిజర్వేటివ్‌లు కలుపుతారు.

ఎలా గుర్తించాలంటే...


కల్తీ నెయ్యి రంగు వేరుగా ఉంటుంది. చూడగానే తెలిసిపోతుంది. దీనికి రుచి, వాసన ఉండవు. సీసాలో పైన ఆయిల్ తేలుతూ కిందన పదార్థంలా పేరుకుపోతుంది. వేడి చేస్తే పూర్తిగా కరగదు. కొంత అలాగే ఉండిపోతుంది.

కల్తీ నేయితో నష్టాలు

● అజీర్ణ సమస్యలు, ● అలర్జీ, ● రంగు కలపడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.

మొక్కలే జీవకోటికి ప్రాణాధారం

ప్రొ.వీఎస్‌ఆర్కే ప్రసాద్



మొక్క నాటుతున్న ప్రొ. ప్రసాద్, డా.కె.వి.రమణ తదితరులు

కంచరపాలెం, సెప్టెంబరు 21: మొక్కలే జీవకోటికి ప్రాణాధారమని ప్రొ. వీఎస్‌ఆర్కే ప్రసాద్ పేర్కొన్నారు. లయన్స్ క్లబ్, ప్రభుత్వ కెమికల్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం కెమికల్ పాలిటెక్నిక్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొ.వీఎస్‌ఆర్కే ప్రసాద్ మొక్కలు నాటారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు స్వచ్ఛతా హి కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటుతామన్నారు. మానవాళి మనుగడకు మొక్కలే ఆధారమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, మాజీ ప్రిన్సిపాల్ డా.బి.దేముడు, డా. బీవీలక్ష్మణరావు, డా.ప్రశాంత కుమారి, ప్రొ.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, సెప్టెంబరు 21 : వరాహలక్ష్మీనృసింహ స్వామికి పలు ఆర్జిత సేవలను శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, సెప్టెంబరు 21 : వరాహలక్ష్మీనృసింహ స్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి 98వ వార్డు సాయినగర్ ప్రాంతానికి చెందిన రెడ్డి రంగారావు, నాగలక్ష్మీ ప్రసన్న దంపతులు రూ.1,00,116 సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో దేవస్థానం ఇన్‌చార్జి ఏఈఓ పిళ్లా శ్రీనివాసరావుకు శనివారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

ప్రక్షాళన దిశగా పరీక్షల విభాగం

వెంకోజీపాలెం, సెప్టెంబరు 21 : ఏయూ పరీక్షల విభాగాన్ని ప్రక్షాళన చేయనున్నట్టు వీసీ శశిభూషణరావు తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పరీక్షల విభాగంలో సీసీ కెమెరాలు ఏర్పాటు, ప్రవేశాలను క్రమబద్ధీకరిస్తున్నట్టు చెప్పారు. అనధికార వ్యక్తుల ప్రవేశాలను పూర్తిస్థాయిలో నియంత్రిస్తామని తెలిపారు. సిబ్బంది, విద్యార్థులు గుర్తింపు కార్డులు చూపించి పరీక్షల విభాగంలోకి వెళ్లాలన్నారు.ఉద్యోగులు విధుల నుంచి బయటకు వెళ్లాలంటే సంబంధిత అధికారి అనుమతి తీసుకోవాలని విద్యార్థులు దళారులను సంప్రదించరాదని చెప్పారు.

ఏయూను సందర్శించిన మైటీ కార్యదర్శి

వెంకోజీపాలెం, సెప్టెంబరు 21 : ఏయూను కేంద్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మైటీ) కార్యదర్శి ఎస్.కృష్ణన్ శనివారం సందర్శించారు. ముందుగా ఏయూ-నాస్‌కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)కి వచ్చారు. అనంతరం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో అధికారులతో భేటీ అయ్యారు. వీసీ శశిభూషణరావు ఆయన్ను వర్సిటీ తరపున స్వాగతించారు. అనంతరం ఇరువురు పలు అంశాలపై చర్చించారు.

'వైసీపీ నిర్వాకంతో టీటీడీ లడ్డూ అపవిత్రం'

భీమునిపట్నం, సెప్టెంబరు 21 : టీటీడీని వైసీపీ ప్రభుత్వం అపవిత్రం చేసిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. శనివారం ఆయన బీచ్‌రోడ్‌లో వున్న పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.లడ్డూ తయారీలో జంతువుల ఎముకులకు సంబంధించిన ఆయిల్ వినియోగించి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని విమర్శించారు. కమీషన్లకు కక్కుర్తిపడి టీటీడీ ప్రతిష్టను మంటగలిపారని ఆరోపించారు.

విజిలెన్స్ విచారణ జరపాలి : ప్రణవ్

వెంకోజీపాలెం, సెప్టెంబరు 21 : టీటీడీ లడ్డూ తయారీలో తప్పు జరగకపోతే వైవీ సుబ్బారెడ్డి విజిలెన్స్ విచారణ ఆపమని కోర్టుకు ఎందుకు వెళ్లారని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ ప్రణవ్ గోపాల్ శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. తప్పు చేయకపోతే వెంటనే విజిలెన్స్ విచారణకు సహకరించాలని డిమాండ్ చేశారు.

మట్టి అక్రమంగా తరలిస్తున్న వాహనాలకు జరిమానా

పద్మనాభం, సెప్టెంబరు 21 : మట్టి అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు తహసీల్దార్ ఆనందకుమార్ శనివారం రూ.35 వేలు జరిమానా విధించారు. ఈనెల 17న అయినాడ పంచాయతీ యాతపేట చెరువు వద్ద ఎటువంటి అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు చేపడుతున్న లారీ, జేసీబీని పద్మనాభం పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ అనంతరం తహసీల్దార్ లారీకి రూ.10 వేలు, జేసీబీకి రూ. 25 వేలు జరిమానా విధించారు.

సినిమా గైడ్

● **మత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)

● **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)

● **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)

● **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),

● **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

● **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 51, టమాటా 42, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 36, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 42, బీరకాయలు 48, ఆనపకాయలు 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 24, క్యారెట్ 37, దొండకాయలు 32, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 56, అల్లం (పాతది) 105, బరబటి 48, ముల్లంగి 38, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 44, దోసకాయ 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 44, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 60, దేముడు చిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 95
ఫారం ధర	-- 115
విత్ స్కిన్	-- 200
స్కిన్‌లెస్	-- 210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



సింహాచలం : గాంధీనగర్‌లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రచారం



పెదవాల్తేరు : 17వ వార్డులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, తదితరులు

వంద రోజుల్లోనే ప్రజలు మెచ్చే పాలన

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు వెలగపూడి రామకృష్ణబాబు

సింహాచలం, సెప్టెంబరు 21 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రజలు మెచ్చే విధంగా పాలన సాగిస్తుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహంతో కలిసి గాంధీనగర్‌లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, జనసేన అధ్యక్షుడు మజ్జి సూరిబాబు, నాయకులు గుసిడి అవినాష్‌బాబు, మేకా కాసుగోపాల్, పట్నాల ధర్మరాజు, సిరిపురపు సురేష్, జి. వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ : జీవీఎంసీ 18వ వార్డులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ గొలగాని మంగవేణి పోలారావు ఆధ్వర్యంలో అప్పుఘర్ ప్రాంతంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు, పలు విభాగాల అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎండాడ : ఎండాడ రాజీవ్‌నగర్‌లో టీడీపీ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అప్పారావు, పరమేశ్వరరావు, ఒమ్మి బాబూరావు, శాఖరీ శ్రీనివాస్, మంగాదేవి, శ్రీను, రాజు పాల్గొన్నారు. 9వ వార్డు రామాలయం వీధిలో వార్డు టీడీపీ అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు ఆధ్వర్యంలోనూ కార్యకమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

మధురవాడ : జీవీఎంసీ ఏడో వార్డు ఆదిత్యనగర్‌లో టీడీపీ విశాఖ పార్లమెంట్ కార్యదర్శి నాగోతి సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతిన అప్పారావు, వెంకటరావు, అనిల్‌రాజ్, బాజీ, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది : రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన సాగుతుందని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. గణేష్‌నగర్, బొట్టవానిపాలెం, సాయిరాం కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు మొల్లి లక్ష్మణరావు, వార్డు అధ్యక్షుడు నాగోతి సత్యనారాయణ, విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వాండ్రాసి అప్పలరాజు, జనసేన వార్డు అధ్యక్షుడు దేవర శివ, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఆరో వార్డు కూటమి నాయకులు సాయిప్రియా లేఅవుట్, వసంతవిహార్, రిక్షా కాలనీ ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, పోతిన రఘు, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

పెదవాల్తేరు : జీవీఎంసీ 17 వార్డు ఆదర్శనగర్‌లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరామ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తిబాబు, కాళ్ల శంకర్, పట్నాయక్, వర, రాములమ్మ, గోవమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.



చిన్నాపురంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మండల ప్రత్యేకాధికారి సునీత, ఆర్డీఓ భాస్కరరెడ్డి

సాగర్‌నగర్ : సాగర్‌నగర్, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో కూటమి నాయకులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, శేఖరి శ్రీనుబాబు పాల్గొన్నారు.

వెంకోజీపాలెం : పాత వెంకోజీపాలెం, ఉమానగర్ ప్రాంతంలో కూటమి నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కూటమి వంద రోజుల పాలనపై ప్రజలకు వివరించారు.

ఆరిలోవ : జీవీఎంసీ పదో వార్డు ఇందిరానగర్‌లో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి రాజశేఖర్ ఆధ్వర్యంలోనూ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు అప్పలనాయుడు, రాజేశ్, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పద్మనాభం : ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీత చెప్పారు. చిన్నాపురం గ్రామంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాసురాజు

ఉపాధి పనులకు రూ. 5.98 కోట్లతో ప్రతిపాదనలు

భీమిలి మండల సమావేశంలో ఎంపీపీ వాసురాజు

భీమునిపట్నం, సెప్టెంబరు 21 : మండలంలోని 16 పంచాయతీల్లో 21 ఉపాధి పనులకు రూ.5.98కోట్లతో ప్రతిపాదనలు చేసినట్టు మండల పరిషత్ ఏఈ కేఆర్ పట్నాయక్ తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వాసురాజు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గత నెల 23న 16 పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో ప్రజల నుంచి అందిన వినతుల మేరకు 211 పనులకు రూ.40.20 కోట్లతో అంచనాలు రూపొందించామన్నారు. వీటిలో ప్రాధాన్యతా క్రమంలో 21 పనులకు ప్రతిపాదనలు చేశామని చెప్పారు. ఎంఈఓ శివరాణి మాట్లాడుతూ మండలానికి సంబంధించిన మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ బాలికల వసతి గృహం గతంలో అన్నవరం గ్రామంలో వుండేదని, పిల్లలకు స్కిన్ ఎలర్జీ వస్తుండడంతో యలమంచిలి సమీపంలోని అమృతపురంలో ఉన్న ఒక అద్దె భవనంలోకి మార్పు చేశామని తెలిపారు. హాస్టల్ నిర్వహణలో చాలా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, స్థలం మంజూరు చేస్తే దివీస్ యాజమాన్యం భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. దీనిపై ఎంపీపీ స్పందిస్తూ తక్షణమే స్థలాన్ని ఎంపిక చేయాలని హెచ్‌డీటీ శ్రీనుబాబును ఆదేశించారు.జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు మాట్లాడుతూ సింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వుందని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తాళ్లవలస ఎంపీటీసీ సభ్యుడు కోరాడ రమణ మాట్లాడుతూ తాళ్లవలస పాత పంచాయతీ భవనం మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని కోరగా, పంచాయతీ నిధులు వినియోగించుకోవాలని ఎంపీపీ సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బంగారునాయుడు, ఎంపీడీవో జానకి, గృహ నిర్మాణ శాఖాధికారి హుస్సేన్, ఏఈ రవి, ఏఓ శివకోమలి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్యామ్ ప్రసాద్

సోలార్ విద్యుత్‌పై అవగాహన అవసరం

ఆనందపురం మండల సమావేశంలో ఎంపీపీ శారద

ఆనందపురం, సెప్టెంబరు 21 : రాయితీపై అందిస్తున్న సోలార్ రూఫ్ టాప్ విద్యుత్ కనెక్షన్లను గ్రామాల్లో అందరూ వినియోగించుకునేలా చూడాలని ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఏఈ సురేశ్‌కుమార్ సోలార్ విద్యుత్ ప్రాధాన్యం వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద రైతులు 70 శాతం రాయితీతో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని సూచించారు. తహసీల్దార్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ భూ రీసర్వేలో నెలకొన్న సమస్యపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామన్నారు. వీహెచ్‌సీ వైద్యాధికారి గంగునాయుడు మాట్లాడుతూ, 18 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ టీబీ వ్యాక్సిన్ తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా తర్లువాడ సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు మాట్లాడుతూ తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సీహెచ్‌సీగా అప్ గ్రేడ్ చేయాలని ప్రతిపాదించారు. జడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు మాట్లాడుతూ గ్రామాల్లో డెంగ్యూ, మలేరియా నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం కూడా మెరుగుపరచాలని కోరారు. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలువురు సర్పంచ్‌లు కోరారు. ఎంపీడీవో లవరాజు పంచాయతీ నిధులతో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవచ్చని సూచించారు.ఈ సమావేశంలో నాయకులు మజ్జి వెంకటరావు, పాండ్రంకి శ్రీను, బొట్టా ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

బాధితులకు తక్షణమే న్యాయం : నగర పోలీస్ కమిషనర్

ఎండాడ, సెప్టెంబరు 21 : పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశించారు. శనివారం రాత్రి ఆయన పీఎంపాలెం పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు చోరీ కేసుల్లో అపహరణకు గురైన వస్తువులను రికవరీ చేయాలన్నారు. ఇటీవల మొబైల్ ఫోన్లు పోగొట్టుకుంటున్న వారి సంఖ్య అధికంగా ఉంటుందని, వాటి గుర్తింపులో సాంకేతికతను వినియోగించాలని సూచించారు.వినాయక నిమజ్జనాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పక్కాగా బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆయనతో పాటు ఏసీపీ అప్పలరాజు, పలు విభాగాల సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

రేపటి నుంచి క్రీడాకారులకు ఎంపిక పోటీలు

ఆనందపురం, సెప్టెంబరు 21 : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 23,24,25 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలకు ఎంపికలు నిర్వహించనున్నట్టు హెచ్ఎం రామకృష్ణ పట్నాయక్ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, చెస్, అథ్లెటిక్స్ క్రీడలకు సంబంధించి ఎంపికలు జరుగుతాయన్నారు. 23న బాలురకు, 24, 25 తేదీల్లో బాలికలకు ఎంపికలు ఉంటాయని చెప్పారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

బీజేపీ ధార్మిక సెల్ జిల్లా కో-కన్వీనర్‌గా పట్నాల రమేశ్

కొమ్మాది, సెప్టెంబరు 21 : బీజేపీ ధార్మిక సెల్ జిల్లా కో-కన్వీనర్‌గా ఆరో వార్డుకు చెందిన పట్నాల రమేశ్ నియమితులయ్యారు. ఈమేరకు శనివారం ఆయన ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు.

చిట్టివలసలో హిందీ భాషా దినోత్సవం

తగరపువలస, సెప్టెంబరు 21 : చిట్టివలస బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం రోజామణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాబాయి, మాధవి, లక్ష్మి, భాగ్యవతి. విజయ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు లక్ష్మీపురం విద్యార్థులు

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 21 : మండలంలోని లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల పీడీ ఎన్. లలిత్‌కుమార్ తెలిపారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బోని కిరణ్, కరుభక్త శ్రావ్య, బత్తుల సునీత విశాఖలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపి జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వారు ఈనెలలో గుంటూరులో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

చిప్పాడలో దివీస్ ఉద్యోగుల స్వచ్ఛతా ర్యాలీ

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 21 : స్వచ్ఛభారత్ మిషన్ పదో వార్షికోత్సవంలో భాగంగా దివీస్ ఉద్యోగులు చిప్పాడ గ్రామంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్ దేవేందరరావు, జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు, సీనియర్ మేనేజర్ ప్రసాద్, రామకృష్ణ, రమణ, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వెలగపూడికి చెక్కు అందిస్తున్న సభ్యులు

వరద బాధితులకు విరాళం

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 21 : విజయవాడ వరద బాధితులకు శ్రీ కనక మహాలక్ష్మీ పూజా సంఘం విరాళం ప్రకటించింది. 28వ వార్డులోని రామ్‌నగర్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంఘం సభ్యులు రూ. 15 వేలు చెక్కును ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో అందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సారిపిల్లి కనకమహాలక్ష్మి, కండిపల్లి మంజులమ్మ, మంగ, షేక్ హసీనా, మణి, మహేష్, సూర్యారావు పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ అప్పారావు జయంతి



గురజాడ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న వీఎంఆర్‌డీఏ అధికారులు

భీమునిపట్నం, సెప్టెంబరు 21 : పట్టణంలోని డైట్ కళాశాలలో గురజాడ అప్పారావు జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం. జ్యోతికుమారి, అధ్యాపకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వ్యవహారిక భాషపై గురజాడ రాసిన రచనలు అనేక మంది కవులకు స్ఫూర్తిదాయకమయ్యాయని చెప్పారు. ఈ సందర్భంగా ఛాత్రోపాధ్యాయులు గురజాడ రాసిన గేయాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు మాణిక్యంనాయుడు, ఎల్.సుధాకర్, జీజీఎస్ నాగేశ్వరరావు, గొట్టేటి రవి, అల్లాఉద్దీన్, ఆర్. నీలిమ తదితరులు పాల్గొన్నారు.

సిరిపురం : గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రంలో ఉన్న ఆయన విగ్రహానికి వీఎంఆర్‌డీఏ అధికారులు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ కొమ్మి రమేష్, కార్యదర్శి దాట్ల కీర్తి, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, డీఎఫ్ఓ శాంతి, చీఫ్ అకౌంటెంట్ హరిప్రసాద్, ఇంజనీర్లు రాజు, రామరాజు, శ్యామల, శివానీ, పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

మద్దిలపాలెం, సెప్టెంబరు 21 : మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కాలుష్యనియంత్రణ మండలి రీజనల్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ ముకుంద పిలుపునిచ్చారు.డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర ప్రజలు ఎక్కువగా ఔషధ గుణాలు కలిగిన మొక్కలు, పక్షులు గూళ్లు నిర్మించుకునేవి, దేశీయ కాయగూరల మొక్కలను నాటాలని సూచించారు. జీవ వైవిధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో విశాఖ కంటైనర్ టెర్మినల్ కెప్టెన్ సందీప్ బెనర్జీ, కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు, గ్రీన్ క్లైమేట్ నిర్వాహకుడు జేవీ రత్నం, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



స్వామివారి సన్నిధిలో ఎమ్మెల్యే గణబాబు, మావూరి వెంకటరమణ

సింహాచలం, సెప్టెంబరు 21 : వరాహలక్ష్మీనృసింహస్వామిని భీమిలి, పశ్చిమ ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, గణబాబు, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ శనివారం దర్శించుకున్నారు. వారికి దేవస్థానం ఇన్‌చార్జి ఈఓ సుజాత, ఏఈఓ ఆనందకుమార్ ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు ప్రసాదాలను అందజేశారు.

ముగిసిన హిందీ దివస్ వారోత్సవాలు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 21 : ఏయూ హిందీ విభాగంలో ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అధ్యక్షతన ప్రారంభించిన హిందీ దివస్ వారోత్సవాలు శనివారంతో ముగిసాయి. చివరి రోజు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కె. కృష్ణబాబు ముఖ్యఅతిథిగా హాజరై హిందీ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.

తీరం పరిశుభ్రత అందరి బాధ్యత

పెదవాల్తేరు, సెప్టెంబరు 21 : తీరం కలుషితం కాకుండా చూడాలని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ అన్నారు. అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవం పురస్కరించుకుని మత్స్యకార సంక్షేమ సమితి, ఇన్‌కాయిస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాలారి ఎండాడ, వాసవానిపాలెం తీర ప్రాంతాలను శుభ్రపరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీర ప్రాంతంలో మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఉమ్మడి మహేశ్, ఐఎన్‌సీవోఐఎస్ శాస్త్రవేత్త శ్రీనివాస్, ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్య నిర్వాహకులు ప్రసాద్‌నాయుడు, ఫిషరీస్ జేడీ విజయ, సీఎంఎఫ్‌ఆర్ఐ ప్రిన్సిపల్ సైంటిస్ట్ శ్రీజో, ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ బామిరెడ్డి పాల్గొన్నారు.